

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 108 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 16, మార్చి 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# జర్నలిస్టులు.. జవాబుదారులు !



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

జర్నలిస్టులు అధికారత్వానికి బానిసలు కారు



**ప్రశ్నిస్తారు నిలదీస్తారు చీల్చి చెండాడుతారు**

**ఎవరో పనికిమాలిన వెధవలు చేసే పనికి యావత్ జర్నలిజాన్ని కించపరచొద్దు**

**నిండు అసెంబ్లీలో రెండవసారి నోరు జారిన సీఎం**

**ప్రశ్నించడం ప్రతి పౌరుని హక్కు జర్నలిస్టులకైతే ప్రత్యేక హక్కులు ఉంటాయి**

**మహిళలను అగౌరవపరిచినోళ్లను తొక్కడమే కాదు జైల్లో వేయండి**

**జర్నలిస్టు ముసుగులో క్రిమినల్ పనులు చేయాల్సిన అవసరం లేదు**

**కాంగ్రెస్ ప్రభుత్వంలో లంచాలకు మరిగిన అధికారులను వదిలేయమంటారా**

**జర్నలిస్టులు క్రిమినల్స్ ఐతే పనిచేయని నాయకులు దేశద్రోహులా...!**

**ప్రతిపక్షాల కుట్రని చీల్చి చెండాడుతున్నది జర్నలిజమైన సంగతి మర్చిపోవద్దు**

**సీఎం పదవికి సీఎం మాటలకు ఏమాత్రం పొంతన లేదు**

**ఐఎన్పిఆర్....డిపిఆర్ఓల మీనింగ్స్ తెలియని నాయకులున్నారు**

**డాక్టర్ బరిగెల శివ జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్ ఆలిఇండియా ఎడిటర్స్ అసోసియేషన్ రాష్ట్ర తెలంగాణ అధ్యక్షులు**

హైదరాబాద్(జై భీమ్ డెస్క్)

ఎన్నికలవేళ రాజకీయ పార్టీలను గెలిపియడానికి ప్రజలను.... ఓటర్లను చైతన్యపరచడానికి రాజకీయ నాయకులు వాడుకునే ఏకైక ఆయుధం జర్నలిజం అలాంటి జర్నలిజాన్ని పార్టీలు మారుతున్నప్పుడు, ప్రభుత్వాలు మారుతున్నప్పుడు సందర్భాల్లోనూ, అసందర్భాల్లోనూ అణచివేత ,అవమానం బూతు మాటలు మాత్రం తప్పడం లేదు. ఎవడేవడో పనికిమాలిన వెధవలు చేసిన సోషల్ మీడియా పోస్టులకు యావత్ తెలంగాణ జర్నలిజం సమాజాన్ని నిండు అసెంబ్లీలో సీఎం స్థాయి లాంటి నాయకుడు రేవంత్ రెడ్డి పరభాషతో ప్రస్తావించడం యావత్ జర్నలిజం సమాజాన్ని కించపరిచేలా ఉందన్నారు. స్వీయ నియంత్రణలో భాగంగా జర్నలిస్టుల లిస్టులను ఇవ్వండి అంటూ జర్నలిస్టు సంఘాలకు సూచించడం అగౌరవం, అమర్యాదగా భావించాల్సి ఉందన్నారు. మేము కూడా నేరుగా ప్రజాక్షేత్రం సాక్షిగా సీఎంను ప్రశ్నిస్తున్నాం మీకులాగా ఎంతమంది నాయకులు ఎంత మంది మంత్రులు ప్రభుత్వం ఏర్పడ్డాక నిజాయితీగా పనిచేస్తున్నారో గుండెల మీద చేయి వేసుకొని.... కుటుంబ సభ్యుల సాక్షిగా ప్రమాణం చేస్తూ లిస్టు సిద్ధపరిచి అదే నిండు అసెంబ్లీలో తెలంగాణ సమాజానికి తెలియపరచాల్సిందిగా కోరుతున్నామన్నారు. జర్నలిస్టులు క్రిమినల్స్ ఐతే పనిచేయని నాయకులు దేశద్రోహుల అంటూ తెలంగాణ సమాజం దీటుగా హెచ్చరిస్తుందన్నారు.ప్రతి సందర్భంలో సీఎంకు ఇచ్చే గౌరవం ప్రజా క్షేత్రంలో ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న ప్రభుత్వ పాలన నాయకులు, ప్రతిపక్షాల నాయకులు, పనికిమాలిన వెధవలకన్నా హీనంగా ప్రవర్తిస్తుంటే అలాంటి వాళ్లకు వంగి వంగి సలాం కొడుతూ గౌరవమివ్వమంటారాంటూ అడుగుతూ అలాంటివాళ్లకు గౌరవ మర్యాదలు ఇవ్వాలంటే ఎలా సాధ్యమవుతుందంటూ యావత్ తెలంగాణ మూడున్నర కోట్ల ప్రజలు సీఎం రేవంత్ రెడ్డిని

- మిగతా 6లో..



## రెండోసారి మళ్లీ నేనే ముఖ్యమంత్రిని

చేసిన అభివృద్ధి పనులే గెలిపిస్తాయి
జర్నలిజం ముసుగులో విషసంస్కృతి
సమాజానికి చీడపురుగులా తయారైయ్యారు
ఇష్టం వచ్చినట్టు మాట్లాడే వాళ్లు జర్నలిస్టులా?
వాళ్ల కామెంట్స్ చూస్తుంటే రక్తం మరిగిపోతుంది
ప్రజాజీవితంలో ఉన్నాం కాబట్టి ఊరుకుంటున్నాం
లేకుంటే పరిస్థితి ఇంకోలా ఉంటుంది
మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి

వివరాలు 7లో



## అమెరికాలో తుపాన్ బీభత్సం..

విరుచుకు పడుతున్న టోర్నడోలు..
ఐదుగురు దుర్మరణం

వివరాలు 7లో

## భానుడు భగభగలు

రోజురోజుకూ మండిపోతున్న ఎండలు
పలు జిల్లాల్లో 41 డిగ్రీల ఉష్ణోగ్రలు నమోదు

7

## హైపర్‌లూప్ ట్రైన్ రాబోతుంది

**బుల్లెట్ ట్రైన్‌కు ధీటుగా భారత్‌లో హైపర్‌లూప్**

**ప్రయోగాత్మక దశలో ప్రాజెక్టు**

**న్యూఢిల్లీ, మార్చి15(ఆర్ఎన్ఎ):**

భారతీయ రైల్వే సహకారంతో చెన్నై ఐఐటీ టీమ్ 422 మీటర్ల హై స్పీడ్ టెస్ట్ ట్రాక్ సిద్ధం చేసింది. కేంద్రమంత్రి అశ్వీనీ వైష్ణవ్ హైపర్ లూప్ ప్రాజెక్ట్‌ను సందర్శించి పురోగతిపై సమీక్షించారు. హైపర్ లూప్ ట్రాక్ ప్రాజెక్ట్‌లో పురోగతిపై హర్షం వ్యక్తం చేశారాయన. ఈ ప్రాజెక్ట్ కోసం ఎంతో కృషి చేస్తున్న చెన్నై ఐఐటీ టీమ్‌ను అభినందించారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు రెండు విడతలుగా కేంద్రం దాదాపు 18 కోట్లు మంజూరు చేసింది. మూడో విడతగా మరో 8 కోట్ల నిధులను ప్రకటించారు. చెన్నై ఐఐటీ ప్రొఫెసర్లు..స్టూడెంట్స్‌తో ఇంటారాక్టయ్యారు అశ్వీనీ వైష్ణవ్. వేగంతో పాటు భద్రతకు ప్రాధన్యాతను ఇస్తూ ఈ ప్రాజెక్ట్‌ను సక్సెస్ చేయాలని సూచించారు . హైపర్‌లూప్ అంటే వేగంగా ప్రయాణించేందుకు తయారుచేసే హైస్పీడ్ ట్రాక్ , ప్రత్యేకంగా విద్యుదయస్కాంత ట్రాక్‌ను తయారుచేస్తారు .ఒక ప్రత్యేకమైన ట్యూబ్‌లో ఈ ట్రాక్ ఉంటుంది. ఈ హైపర్‌లూప్‌లో రైళ్లు గంటకు వెయ్యి కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తాయి. మరింత అభివృద్ధి చేస్తే ఈ హైపర్‌లూప్ గంటకు 12వందల కిలోమీటర్ల వరకు వెళ్లగలదు. ఒక ట్యూబ్‌లో వ్యాక్యూమ్ సృష్టించడం ద్వారా ఇది పరుగులుదీస్తుంది. ప్రస్తుతం ఇది ప్రయోగాత్మక దశలో ఉంది.

## ఫామ్ ల్యాండ్ ఫ్రాడ్





త్వరలో.... మోసం అంటే బుచ్చిబాబు...

**బుచ్చిబాబు అనే ఏంజెంట్ రైతులను మోసగిస్తున్నాడు**

**బుచ్చిబాబుకు సహకరిస్తున్న మున్సిపల్ రెవెన్యూ రాజకీయ నాయకులెవరు**

**ఇటు తెలంగాణలో ఆటు ఆంధ్రాలో ఫామ్ ల్యాండ్ ఫ్రాడ్ పైచర్చ**

**రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకుల అండతో రెచ్చిపోతున్నారు**

**ప్రజల వద్ద సేకరించిన భూమి డబ్బులు లెక్కలు చెప్పండి**

**లాభాల కోసం వ్యాపారం చేస్తున్నారా రైతుల మేలుకోసమా**

**రైతులను మోసగిస్తే సహించేది లేదు**

**డాక్టర్ బరిగెల శివ**

6



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# సంపాదకీయం

## దక్షిణాది తురుపుముక్క పవన్ కళ్యాణ్ !



జనసేనాని,ఎపి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ పిఠాపురం వేదికగా పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేసిన ప్రసంగం పరిశీలిస్తే..ఆయనలో పరిణతి చెందిన రాజకీయ నాయకుడిని చూడవచ్చు. దేశం పట్ల, ప్రజల సమస్యల పట్ట నిబద్ధత కలిగిన నాయకుడిని చూడవచ్చు. అలాగే దక్షిణాదిలో ఇక నాయకులకు కొరత లేదన్న విషయమూ గమనించవచ్చు. ఎంతో హుందాగా, ఉన్నది ఉన్నట్లుగా.. ముక్కుసూటిగా ఆయన తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. పివి నరసింహారావు, జైపాల్ రెడ్డి, వెంకయ్య నాయుడు, విద్యాసాగర్ రావు లాంటి నేతల తరవాత అంతకన్నా బలమైన నాయకుడు ఆయనలో కనిపించాడు. తెలుగుదేశం నుంచి రామ్మోహన్ నాయుడు మంచి వక్తగా పేరు పొందారు. పార్లమెంటులో కూడా చురుకైనా పాత్ర పోషిస్తున్నారు. ఆయన కూడా దక్షిణాది నుంచి మంచి నేతగా ఎదిగే లక్షణాలను పుణికి పుచ్చు కున్నారు. అయితే పవన్ కళ్యాణ్ ఓ రకంగా దక్షిణాదికి తురుపుముక్కగా చెప్పుకోవచ్చు.

పవన్ మాట్లాడినప్పుడల్లా ప్రకాశ్ రాజ్ లాంటి వారు విమర్శలు చేస్తూనే ఉన్నారు. సనాతన ధర్మం గురించి మాట్లాడినా విమర్శించన ఘనుడు ప్రకాశ్ రాజ్. తాజాగా కూడా దక్షిణాన హిందీ గురించి పవన్ కళ్యాణ్ మాట్లాడిన దానికి విపరీత వ్యాఖ్యాలను చేశారు. ఇదంతా పక్కన పెడితే దక్షిణాదిలో గట్టిగా నిలబడే నాయకుడిగా పవన్ కళ్యాణ్ ఉంటారని చెప్పడంలో సందేహం లేదు. దేశం గురించి, సమస్యల గురించి బాగా అవగాహనతో ఉన్న నేత పవన్ కళ్యాణ్ అనడంలో సందేహం లేదు. ఆయన చేసిన ప్రసంగం, సమస్యలు, దేశం పట్ల ఉన్న అవగాహన ఇవన్నీ కూడా పరిణతి చెందిన నేతగా నిలబెట్టాయనడంలో సందేహం లేదు. జనసేన 11 ఏండ్ల ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని,..ఎన్నో కష్టష్టాలను ఓర్చుకుని..వేధింపులను తట్టుకుని...అరాచక పార్టీని అధికారం నుంచి దింపడమే కాదు...11 సీట్లకే పరిమితం చేశామని జనసేనాని తన పోరాట పటిమను, పడ్డ కష్టాలను వివరించారు. నిజానికి ఎపిలో జగన్ రాజ్యంలో విపక్ష నేతలను కట్టి పడేయడం లక్ష్యంగా పాలన సాగించారు. అసెంబ్లీ గేటును కూడా తాకనివ్వమని చెప్పిన వారిని అధికారానికి దూరం చేశామని పవన్ అందుకే అన్నారు. ఆయనలో ఉన్న కసి, పట్టుదలను ఈ సందర్భంగా మనం గమనించవచ్చు. ఎంతపట్టుదల, నమ్మకం, సమస్యల పట్ల అవగాహన, ప్రజల పట్ల విశ్వాసం ఉంటే తప్ప రాజకీయనేతగా నిలబడలేరు. ఎన్టీఆర్ తొలినాళ్లలో రాజకీయాల్లోకి వచ్చిన సందర్భంగా మాట్లాడిన తీరును బేరీజు వేసుకుంటే ఇప్పుడు..పవన్ కళ్యాణ్ తీరు అలాగే ఉంది. ఆయనకు దేశం పట్ల ఉన్న అంకితభావం కనిపిస్తోంది. హిందీభాష పట్ల జరుగుతున్న రగడ, సనాతన ధర్మాన్ని కించపరుస్తున్న తీరును కూడా ఆయన గట్టిగానే ఎదుర్కొన్నారు. పివి నరసింహారావు తరవాత దక్షిణాదిలో పలువురు నేతలు వెలుగులోకి వచ్చారు. ప్రముఖంగా వెంకయ్యనాయుడు, జైపాల్ రెడ్డి ఉన్నారు. వీరి తరవాత ఇప్పుడు నాయకులు లేకుండా పోయారు. భాషపై స్పష్టమైన ఆధిక్యం ఉండాలి. అలాగే తాను చేయగలనన్న ధైర్యం ఉండాలి. ఇవి పవన్‌లో చూస్తున్నాం. ఎన్నికల్లో ఓడినా అడుగు ముందుకే వేశామని, ఎన్నికల్లో విజయం సాధించామని పవన్ కళ్యాణ్ అనడంలో ఓ ధైర్యం కనిపించింది. 'మనం నిలబడ్డాం.. పార్టీని నిలబెట్టాం. నాలుగు దశాబ్దాల టీడీపీని నిలబెట్టాం. 2019లో మనం ఓడిపోయినప్పుడు మీసాలు మెలేశారు.. జబ్బలు చరిచారు. మన ఆడపడుచుల్ని అవమానించారు. ప్రజల్ని ఇబ్బంది పెట్టారు. ఇదేం న్యాయం అని వీర మహిళలు అడిగితే కేసులు పెట్టి జైళ్లలో వేశారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడిని కూడా జైల్లో పెట్టారు. నన్ను అణచివేసేందుకు అనేక కుట్రలు చేశారు. అసెంబ్లీ గేటు కూడా తాకనీయమని ఛాలెంజ్ చేశారు. 21 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో, ఇద్దరు ఎంపీలతో పార్లమెంట్‌లో అడుగు పెట్టాం. దేశమంతా మన వైపు చూసేలా 100 శాతం స్ట్రయిక్ రేట్ సాధించాం అంటూ ఆయన ఉద్వేగపూరితంగా చేసిన ప్రసంగం నిజంగానే ధీరోదాత్త నాయకుడి పాత్రను ఆవిష్కరించారు. భయం లేదు కాబట్టే ఇంత దూరం వచ్చా. గుండె ధైర్యమే కవచం' అని పవన్ చేసిన ప్రసంగ పాఠం ఆయనలో లోలోతుగా ఉన్నా పరిణతి చెందిన నాయకుడిని చూడవచ్చు. 'జనసేన జన్మస్థలం తెలంగాణ.. కర్మస్థానం ఆంధ్రప్రదేశ్. నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ దాశరథి కృష్ణమాచార్యుల కవిత్వంతో ఆయన తన ప్రసంగాన్ని ప్రారంభించడమే గాకుండా దేశం కోసం నిలబడ తామని ప్రకటించిన తీరును చూశాక తప్పకుండా పవన్ దక్షిణ్యాది రాజకీయాల్లో తనదైన ముద్ర వేస్తారనడం లో ఎలాంటి సందేహం లేదు. అలాగే ఆయన మాటమీద నిలబడతారని కూడా చెప్పవచ్చు. డిప్యూటి సిఎంగా ఇప్పటికే ఆయన చేపట్టిన పనులు ప్రజల్లో విశ్వాసం నింపాయి. సమస్యలపై పట్టుదలతో ముందుకు సాగుతున్న తీరు కూడా ప్రజల్లో ఆదరణను పెంచాయి. రుద్రవీణ వాయిస్తా.. అగ్నిధారలు కురిపిస్తాం.. అనే మాటలు నిజం చేశాం. బహు భాషలే భారతదేశానికి మంచిదని ప్రకటించారు. తమిళనాడు సహా అన్ని రాష్ట్రాలకు ఒకే సిద్ధాంతం ఉండాలని హిందీవ్యతిరేక తీరును గట్టిగానే తూర్పార బట్టారు. జనసేన వంద శాతం స్ట్రయిక్ రేట్ సాధించిందంటే.. అందుకు ఏడు సిద్ధాంతాలే కారణం. ఎంతో ఆలోచించి ఏడు సిద్ధాంతాలు పెట్టాం. సినిమాల్లోనూ దేశ భక్తి ఉండాలని తపించేవాడిని. సమాజంపై అవగాహన లేకుండానే పార్టీ పెట్టేస్తామా? సమాజంలో మార్పు కోసం వచ్చా.. ఓట్ల కోసం కాదు. భిన్నమైన వ్యక్తుల్లో ఏకత్వం చూడగలగడమే నా ఐడియాలజీ అని భావోద్వేగంతో చేసిన ప్రసంగం ఇప్పుడు రాకీయాల్లో మార్పుకు శ్రీకారం అవుతుందనడంలో సందేహం లేదు. రాజకీయాల్లో సైద్ధాంతిక విధానాన్నే ఎంచుకున్నా. ఎంత పోరాటం చేస్తే ఇక్కడికి వచ్చాం.. అర్థం చేసుకోవాలి. బలమైన దేశం కావాలంటే.. బలమైన ప్రజలు ఉండాలి. దేశం కోసం బలంగా నిలబడే యువత ఉంటేనే దేశం మారుతుంది. భవిష్యత్తును నిర్మించే యువ నాయకత్వం రావాలి. భవిష్యత్తుకు దిశా నిర్దేశర చేయాల్సిన సమయం. సనాతన ధర్మం నా రక్తంలోనే ఉంది.. నిరూపించుకోవాల్సిన అవసరం లేదని ఇలా చెబుతూ పోతుంటే...ఆయన ధృడసంకల్పాన్ని చూడవచ్చు. ఎవరెన్ని విమర్శలు చేసినా, రాజకీయంగా విభేదించినా పవన్ కళ్యాణ్ దక్షిణ భాతర దేశంలో మరో అద్భుతమైన నేతగా నిలబడతారనడంలో సందేహం లేదు.



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

# మరో వారం రోజుల్లో ఐపిఎల్

**వేసవిలో మజా ఇవ్వనున్న టోర్నీ**

**ముంబై,మార్చి15(జై భీమ్ న్యూస్):**

క్రికెట్‌లో మరో మజా గేమ్ ప్రారంభం కాబోతుంది. ఇప్పటికే ఛాంపియన్స్ ట్రోఫీని టీమిండియా కైవసం చేసుకోవడంతో క్రికెట్ అభిమానుల్లో మళ్లీ ఉత్సాహం నెలకొంది. ఈ క్రమంలో ఐపిఎల్‌కు తెరలేవనుంది. అభిమానులు ఎంతో అతృతతో ఎదురు చూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఐపిఎల్ సీజన్ 2025కి మార్చి 22న ప్రారంభం కానుంది. మే 25న కోల్‌కతాలో జరిగే ఫైనల్ తో మెగా టోర్నీకి తెరపడుతుంది. ఈసారి కూడా పది జట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌రాయల్ ఛాలెంజర్స్ జట్ల మధ్య మార్చి 23న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే మ్యాచ్‌తో టోర్నమెంట్ ప్రారంభమవుతోంది. ఈ సారి అన్ని జట్లు ట్రోఫీపై కన్నేశాయి. కిందటిసారి రన్నరప్‌గా నిలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈసారి ఎలాగైనా ఛాంపియన్‌గా నిలవాలనే పట్టుదలతో ఉంది. కోల్‌కతా కూడా టైటిల్ నిలబెట్టుకోవాలనే లక్షంతో పోరుకు సిద్ధమైంది. ప్రస్తుత ఛాంపియన్ కోల్‌కతా కూడా టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. రహానె సారథిగా రావడంతో జట్టు ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే ఆటగాళ్లకు జట్టులో కొదవలేదు. ఇలా బరిలో ఉన్న పది జట్లలో కూడా ప్రతిభావంతులైన క్రికెటర్లు ఉండడంతో మెగా టోర్నమెంట్ ఆసక్తికరంగా సాగడం ఖాయం. ఇక ఆరంభం నుంచి టోర్నమెంట్‌లో ఆడుతున్నా ఒక్కసారి కూడా ట్రోఫీని సాధించడంలో విఫలమవుతూ వస్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ ఈసారి ఆ లోటును తీర్చుకోవాలని భావిస్తున్నాయి. మూడు జట్లు కూడా కొత్త కెప్టెన్ల సారథ్యంలో బరిలోకి దిగుతున్నాయి. ఢిల్లీ అక్షర్ పటేల్‌ను కెప్టెన్‌గా నియమించుకుంది. పంజాబ్ కింగ్స్ శ్రేయస్ అయ్యర్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించింది. ఇక బెంగళూరు సారథిగా రజత్ పటిదార్ ఎంపికయ్యారు. కొత్త కెప్టెన్ల సారథ్యంలో ట్రోఫీని గెలుచుకోవాలని ఈ మూడు జట్లు తహతహలాడు తున్నాయి. ఇక ప్రస్తుత ఛాంపియన్ కోల్‌కతా కూడా కొత్త సారథిని ఎంపిక చేసింది. ఈసారి అజింక్య రహానె కోల్‌కతా టీమ్ కెప్టెన్సీ బాధ్యతలను చేపట్టనున్నాడు. కిందటి సీజన్‌లో సారథిగా ఉన్న శ్రేయస్ అయ్యర్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ రిటేన్ చేసుకునేందుకు ఆసక్తి చూపించలేదు. దీంతో అతను వేలం పాటలో బరిలోకి దిగిన పంజాబ్‌కు ఎంపికయ్యాడు. పంజాబ్ టీమ్ భారీ మొత్తాన్ని వెచ్చించి శ్రేయస్‌ను సొంతం చేసుకుంది. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్ కూడా భారీ ఆశలతో కనిపిస్తోంది. మెగా వేలం పాటలో రిషబ్ పంత్ భారీ మొత్తాన్ని వెచ్చించి సొంతం చేసుకుంది. అనుకున్నట్టే రిషబ్‌కే సారథ్య బాధ్యతలను అప్పగించింది. అతని కెప్టెన్సీలో లక్నో తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. గుజరాత్ టైటాన్స్ కూడా భారీ ఆశలతో పోరుకు సిద్ధమైంది. ఈసారి కూడా శుభ్‌మన్ గిల్ జట్టుకు సారథ్యం వహిస్తున్నాడు. రషీద్ ఖాన్, ÷-లగెన్ ఫిలిప్స్, రాహుల్ తెవాటియా, జోస్ బట్లర్ వంటి టి20 స్పెషలిస్టులు జట్టులో ఉన్నారు. మాజీ ఛాంపియన్‌లు ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్‌లు కూడా మెరుగైన ప్రదర్శన ఇచ్చేందుకు సిద్ధమయ్యాయి. రెండు జట్లలోనూ ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవలేదు. ఈసారి ట్రోఫీని సాధించాలనే పట్టుదలతో రెండు జట్లు కనిపిస్తున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ కూడా టైటిల్‌పై కన్నేసింది. కమిన్స్ సారథ్యంలోని హైదరాబాద్ రెండు విభాగాల్లోనూ సమతూకంగా కనిపిస్తోంది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్, నితీష్ కుమార్ రెడ్డి, కమిందు మెండిస్‌లతో హైదరాబాద్ బలంగా ఉంది.


## నా జీవితంలో ఎన్నో అలుపెరగని పోరాటాలు

**సహకరించండి.. మరింత అభివృద్ధి చేస్తాం**

**22 ఏళ్లలో రాష్ట్రాన్ని నెంబర్‌వన్ చేస్తా : నారా చంద్రబాబునాయుడు**

**అమరావతి,మార్చి15(జై భీమ్ న్యూస్):**

జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన కొనసాగుతోంది. స్వచ్ఛ్ దివస్ కార్యక్రమంలో భాగంగా తణుకులో ఏర్పాటు చేసిన ప్రజావేదిక వద్ద ప్రజలతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంను ప్రజలు పలు ప్రశ్నలు వేశారు. దానికి చంద్రబాబు సమాధానం ఇచ్చారు. '47 ఏళ్ల క్రితం అసెంబ్లీకి వెళ్ళాను. 41 ఏళ్లుగా అసెంబ్లీకి వెళుతున్నాను. పదేళ్లు ప్రతిపక్ష నేతగా పనిచేశాను. నా జీవితం అంతా అలుపెరుగని పోరాటం. నా చివరి రక్తపు బొట్టు వరకు మీకు సేవ చేయాలనేదే నా సంకల్పం. ఇప్పటి వరకు ఎంత పనిచేశానో, రాబోయే 5, 10 ఏళ్లలో అంతకంటే రెట్టింపుగా పనిచేస్తాను. మీ సహకారం ఇవ్వండి. రాబోయే 22 ఏళ్లలో మన రాష్ట్రాన్ని దేశంలో నెంబర్ వన్‌గా చేస్తాను' అని చంద్రబాబు తెలిపారు. అలాగే అడిగిన మరికొన్ని ప్రశ్నలకు కూడా సీఎం రిప్లై ఇచ్చారు. ఆరోగ్యశ్రీలో కొన్ని టెస్టులు చేయడం లేదని నందిని అనే మహిళ ప్రశ్నించారు. అలాగే పెన్షన్ కోసం సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసినా ఇవ్వడం లేదని మరొకరు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ముఖ్యమంత్రి సమాధానమిస్తూ.. 'నేను వచ్చింది మీకు బాధ్యతలు కూడా గుర్తు చేయడానికి. ఇలా ఏ సీఎం అయినా నాలాగా వచ్చారా.. ఎవరికైనా మైక్ ఇచ్చారా.. ఎవరైనా వచ్చినా పరదాలు కట్టుకుని వచ్చా రు.. విమానంలో అలా తిరిగి వెళ్ళిపోయేవారు. ఇది ప్రజా ప్రభుత్వం.. సంక్షేమం, అభివృద్ధి రెండు చేయాలనేదే నా అభిమతం. 2004లో టీడీపీని గెలిపించి ఉంటే ఏపీ ఎక్కడికో వెళ్ళిపోయేది. 2019లో నన్ను గెలిపించి ఉంటే, విభజన రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెంది ఉండేది. దానిలో నా తప్పు ఉంది. గుజరాత్‌లో స్థిరమైన ప్రభుత్వం వలన అభివృద్ధి సాధ్యమైంది. స్థిరమైన ప్రభుత్వం ఉంటే అభివృద్ధి స్థిరంగా సాగుతుంది" అని చెప్పుకొచ్చారు. ఏపీలో ఇప్పుడు ఉన్నది ప్రజాప్రభుత్వమన్నారు. వైసీపీకి అధికారం ఇస్తే ఏపీని అంధకారంలోకి నెట్టేశారని మండిపడ్డారు. వేరే వాళ్లు వస్తే ఏదో చేస్తారని ఓట్లేశారన్నారు. ఐదేళ్లలో విపరీ తంగా అపపులు చేసి వెళ్లారని సీఎం వ్యాఖ్యలు చేశారు. మన ఆరోగ్యానికి ఎందుకు ఇబ్బందులు వస్తున్నాయో ఆలోచించాలన్నారు. తిండి, తాగేనీరు, అపరిశుభ్రత వలన వస్తున్నాయని కూడా గమనించాలన్నారు. ఆరోగ్య శ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్‌తో 25 లక్షల వరకు ఆర్థిక సహాయం అందజేస్తున్నామని తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ రూపొందించామన్నారు. విజన్ రూపొందించడమే కాదని.. తలసరి ఆదాయం పెరిగిందా లేదా అని పరిశీలిస్తున్నామని అన్నారు. వారసత్వంగా 87 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వదిలిపోయారని...దానిని తీయడానికి నాలుగైదు నెలలు పడుతుందన్నారు. స్వర్ణాంధ్ర కోసం ఉద్యమం చేస్తూనే, స్వచ్ఛాంధ్ర కోసం ఉద్యమం చేయాలన్నారు. వేస్ట్ ఎనర్జీ కింద కంపోస్టు తయారుచేయడానికి ఒక టెక్నాలజీ వచ్చిందని తెలిపారు. బయో డైవర్సిటీ పేరుతో 10 లక్షలతో మెటీరియల్ పెడితే, కంపోస్టు తయారు చేయవచ్చని చెప్పారు. తణుకు ఎన్టీఆర్ పార్క్‌ను తాను డెవలప్ చేశానని.. కానీ దానిని నాశనం చేశారని ఫైర్ అయ్యారు. 'ఒక బాధ్యత కలిగిన ప్రభుత్వం వచ్చినపుడు, మీరు కూడా బాధ్యతతో వ్యవహరిస్తే, మంచి ఫలితాలు వస్తాయి. ఒకప్పుడు పారిశధ్య కార్మికులను చులకనగా చూసేవారు. వారు మన ఆరోగ్యాన్ని కాపాడుతున్నారు. వారిపై గౌరవం పెరిగింది.. మునిసిపల్ కార్మికులు అందరిని ఆదుకుంటాం. మీ పరిసరాలు, మీ ఇల్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. సమాజం కోసం, స్వర్ణాంధ్ర కోసం స్వచ్ఛందంగా పనిచేయడానికి ముందుకు వచ్చారు..వారిని అభినందించాలి. వారి కోసం ఒక యాప్‌ను రూపొందిస్తాం. ప్లాస్టిక్ చాలా ప్రమాదకరం.. పశువులు వాటిని తిని, చనిపోతున్నాయి. ప్లాస్టిక్ వలన తినే తిండి కూడా విషం అయిపోతున్నది. క్యాన్సర్ వచ్చినప్పుడు బాధ పడుతున్నాం. కానీ క్యాన్సర్ కారణమైన ఆహారం గురించి ఆలోచించాలి. రాష్ట్రంలో క్యాన్సర్ రాకుండా చేయడానికి నోరి దత్తాత్రేయుడుని సలహాదారుగా నియమించాం. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై యుద్ధమే చేయాలి. దానివలన చెడు పరిణామాలు ఉన్నాయి. ప్రమాదకరమైన ప్లాస్టిక్ తయారుచేసే వారిని నియంత్రిదాం' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.



## సునీతా విలియమ్స్‌కు లైన్ క్లీచర్

**రోదసీలోకి దూసుకెళ్లిన ఫాల్కన్**



**వాషింగ్టన్,మార్చి15(జై భీమ్ న్యూస్):**

మూడోసారి రోదసీలోకి వెళ్లి అంతరిక్షకేంద్రంలోనే చిక్కుకుపోయిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ త్వరలోనే భూమ్మీద కాలుమోపే దిశగా అడుగులు పడ్డాయి. నాసా-స్పేస్ ఎక్స్‌లు తాజాగా క్రూ-10 మిషన్‌ను చేపట్టాయి. నలుగురు వ్యోమగాములతో కూడిన ఫాల్కన్ 9 రాకెట్ భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం 4.33 గంటలకు కెన్నడీ స్పేస్‌సెంటర్ నుంచి నింగిలోకి తీసుకెళ్లింది. దాదాపు తొమ్మిది నెలలుగా సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌అంతరిక్ష కేంద్రం లోనే ఉంటున్న విషయం తెలిసిందే. వారిని భూమిపైకి తీసుకొచ్చేందుకు మూడు రోజుల క్రితం క్రూ-10 మిషన్ ను చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే చివరి నిమిషంలో సాంకేతిక కారణాలతో ఆ ప్రయోగాన్ని నిలిపేశారు. తాజాగా వారిని తీసుకొచ్చేందుకు మళ్లీ ప్రయోగం చేపట్టారు. డ్రాగన్ క్యాప్సుల్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లిన వారిలో అన్నె మె÷-లకెయిన్, నికోల్ అయర్స్, టకుయా ఒనిషి, కిరిల్ పెస్కోవ్ వ్యోమగాములు ఉన్నారు. 2024 జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక స్టార్‌లైనర్‌లో ఐఎస్ఎస్‌కు సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌లు చేరుకున్నారు. స్టార్‌లైనర్‌లో సమస్యలు తలెత్తడంతో వారు లేకుండానే అది భూమిపైకి చేరింది. దీంతో వారిని తీసుకురావడానికి పలు అవాంతరాల దాదాపు తొమ్మిది నెలల తర్వాత నలుగురు వ్యోమగాములను ఐఎస్ఎస్‌కు పంపించారు.

## మరో దుందుడుకు చర్య దిశగా ట్రంప్

**41 దేశాలపై ట్రావెల్ బ్యాన్ విధించే యోచన**

**వాషింగ్టన్,మార్చి15(జై భీమ్ న్యూస్):**

ఉద్యోగాల కోతలు, దేశాలపై సుంకాలతో దూకుడు పాలన సాగిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో కీలక నిర్ణయానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. పదుల కొద్దీ దేశాలపై ట్రావెల్ బ్యాన్ విధించే అంశాన్ని ట్రంప్ సర్కారు పరిశీలిస్తున్నారని సమాచారం. 41 దేశాల పౌరులు అగ్రరాజ్యంలోకి రాకుండా త్వరలో ప్రయాణ ఆంక్షలు జారీ చేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇందుకు సంబంధించి ఒక ఇంటర్నల్ మెమో బయటికొచ్చింది. అందులో మొత్తం ఈ 41 దేశాలను మూడు గ్రూప్‌లుగా విభజించినట్లు సమాచారం. పది దేశాలతో ఉన్న మొదటి గ్రూప్‌లో అఎ÷-గానిస్థాన్, ఇరాన్, సిరియా, క్యూబా, ఉత్తరకొరియా వంటివి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దేశాల పౌరులకు వీసాల జారీ పూర్తిగా నిలిపివేయ నున్నారని ప్రచారం. ఇక, రెండో గ్రూప్‌లో ఇరిట్రియా, హైతీ, లావోస్, మయన్మార్, దక్షిణ సూడాన్ దేశాలున్నాయి. వీటిపై పాక్షిక ఆంక్షలు అమలుచేయనున్నారని ఆ మెమోలో పేర్కొన్నారు. ఈ దేశాలకు పర్యటక, విద్యార్థి వీసాల వంటివి జారీ చేయకూడదని భావిస్తున్నారు. అయితే వీటికి కొన్ని మినహాయింపులు కల్పించే అవకాశాలున్నాయి. మూడో గ్రూప్‌లో పాకిస్థాన్, భూటాన్ సహా 26 దేశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దేశాలు 60 రోజుల్లోపు తమ 'లోపాలను పరిష్కరించుకోవడానికి' ప్రయత్నాలు చేయకపోతే అక్కడి పౌరులకు వీసా జారీని పాక్షికంగా నిలిపివేయాలని యూఎస్ యంత్రాంగం భావిస్తున్నట్లు ఆ మెమోలో ఉంది. ప్రస్తుతానికి ఈ జాబితాను అమెరికా మీడియా సంస్థలు ప్రచారం చేయగా.. ఇందులో మార్పులు ఉండొచ్చని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆమోదం తర్వాత దీనిపై అధికారిక ప్రకటన వెలువడనున్నట్లు సమాచారం. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ ఇలాంటి నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇరాన్ సహా ఏడు ముస్లిం మెజారిటీ దేశాల ప్రయాణికులపై నిషేధం విధించారు. అప్పట్లో ఈ నిర్ణయాన్ని అమెరికా సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. ఇక, 2023లోనూ ట్రంప్ ఈ ప్రణాళికల గురించి ప్రస్తావించారు. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపడితే గాజా స్ట్రిప్, లిబియా, సోమాలియా, సిరియా యెమెన్ వంటి దేశాల నుంచి పౌరుల రాకపై ఆంక్షలు విధిస్తానని తెలిపారు. దేశ భద్రతకు ముప్పు అని భావించేవారిని అమెరికాలోనికి ఎన్నటికీ రానివ్వబోమని అన్నారు.

# గవర్నర్ ప్రసంగాన్ని బీఆర్ఎస్ హేళన చేసింది

**సీఎం రేవంత్ రెడ్డి**

**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. గవర్నర్? ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ కొనసాగుతోంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ తీరుపై మండిపడ్డారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ చేసిన విమర్శలను తిప్పికొట్టారు. కాంగ్రెస్ మేనిఫెస్టో అని.. గాంధీ భవన్ లో మాట్లాడినట్టు ఉంది అని బీఆర్ఎస్ వాళ్ళు గవర్నర్ ప్రసంగంపై విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంపై రేవంత్ మాట్లాడుతూ.. పదేళ్లు అధికారంలో ఉన్న వాళ్ళు ఇలా మాట్లాడుతారా..? అజ్ఞానమే.. తన విజ్ఞానం అనుకుంటున్నారు అని బీఆర్ఎస్ ను ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్టీ నిర్ణయాలకు అనుగుణంగానే గవర్నర్ ప్రసంగం ఉంటుంది. మంత్రివర్గం ఆమోదం తెలిపిన స్పీచ్ నే గవర్నర్ ప్రసంగిస్తారని సీఎం తెలి పారు. రాష్ట్రపతి ప్రసంగం కూడా కేంద్ర కేబినెట్ ఆమో దించిన స్పీచ్ మాత్రమే చదువుతారని గుర్తుచేశారు. ఎన్నికల్లో తెలంగాణ ప్రజలకు మేము మేనిఫెస్టో ఇచ్చాము. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ వచ్చాం. మా పార్టీ నిర్ణయాలే గవర్నర్ ప్రసంగంలో ఉంటాయి. మా ప్రభుత్వ విధానాన్నే గవర్నర్ చెప్తారు. ఈ మాత్రం అవగాహన లేని వాళ్ళు పదేళ్లు మంత్రులుగా చేసినం అని చెప్పుకోవడాని కి అనర్హులు అంటూ సీఎం రేవంత్ చురకలంటించారు. బీఆర్ఎస్ వాళ్లకు గవర్నర్ అన్నా.. మహిళలు అన్నా గౌరవం లేదు అని మండి పడ్డారు. బీఆర్ఎస్ చేసిన తప్పులు మా ప్రభుత్వం చేయదని స్పష్టం చేశారు. అబద్దాల ప్రతిపాదన మీద కాదు.. వాస్తవాల మీద ప్రభుత్వం నడపాలని చూస్తున్నాం అని సీఎం రేవంత్ వెల్లడించారు. ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ఎన్నికలు వచ్చినప్పుడే అకౌంట్ లో రైతు బంధు డబ్బులు వేసేవారని గత ప్రభుత్వాన్ని విమర్శించారు. కోకపేట భూములు అమ్మి 2023 లో అసలు రైతు బంధు వేయలేదు. గత ప్రభుత్వం ఎగ్గొట్టిన రైతు బంధు మేము వేశామని సీఎం రేవంత్ తెలిపారు.



# విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా సులభతర విద్యా బోధన

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**
**పైలెట్ ప్రాజెక్టు కింద**
**నేటి నుండి జిల్లాలోని 11 ప్రాథమిక పాఠశాలలో ఏఐ ద్వారా విద్య బోధన ప్రారంభం**
**వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల ప్రాథమిక పాఠశాలలో ఏఐ ద్వారా బోధనను ప్రారంభించిన కలెక్టర్**

**వరంగల్ జిల్లా (చెన్నరావుపేట) జై భీమ్ న్యూస్**

ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కృత్రిమ మేధను వినియోగిస్తూ సులభతరంగా విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. శనివారం వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం జెల్లీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (కృత్రిమ మేధ) తో విద్య బోధన ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కంప్యూటర్ లో చేస్తున్న తెలుగు, ఆంగ్లానికి సంబంధించిన ప్రమాణాలను పరిశీలించారు. గణితంలో సంఖ్యా భావాలు, కూడికలు, తీసివేతలు, గుణకారాలు బాగాహారాలు, తెలుగులో విద్యార్థులు చేస్తున్న ప్రమాణాలను కలెక్టర్ పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో ప్రభుత్వ పాఠశాలలో విద్య బోధన చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద ఈరోజు వరంగల్ జిల్లా వ్యాప్తంగా 11 ప్రభుత్వ పాఠశాలలో ఏఐ సహకారంతో వర్చువల్ రియాల్టీ విధానములో పాఠాలు చెప్పేలా ప్రారంభించుకున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 3 నుండి 5 తరగతి విద్యార్థులకు కనీస విద్య ప్రమాణాలు, అభ్యాసన సామర్థ్యాలను పెంచే లక్ష్యంగా ఏఐ ద్వారా బోధిస్తున్నట్లు తెలిపారు. దీనిపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటికే ఆరు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా కార్యక్రమాన్ని ప్రారంభించగా అక్కడ మంచి ఫలితాలు ఇచ్చినందున రాష్ట్రంలోని మిగతా జిల్లాలతో పాటు వరంగల్ జిల్లాలో కూడా ఈరోజు నుండి అమలు చేస్తున్నట్లు తెలిపారు.



**10వ తరగతిలో పదికి పది జీపీఏ సాధిస్తే దావత్ ఇస్తా... జిల్లా కలెక్టర్**

పదవ తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల పరీక్షల కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి విద్యార్థులను ప్రోత్సహించి, పదవ తరగతిలో పదికి పది జీపీఏ సాధిస్తే దావత్ ఇస్తానని తెలిపారు. మధ్యాహ్న భోజనం పథకం కింద విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. మెనూ ప్రకారం రుచికరమైన నాణ్యమైన భోజనం అందించాలన్నారు. స్టోర్‌రూమ్‌లో సరుకులను బియ్యాన్ని పరిశీలించి సక్రమంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి అంగన్వాడి కేంద్రంలో ఎంతమంది పిల్లలు ఉన్నారని తెలుసుకొని మధ్యాహ్నం అందించిన భోజనాన్ని, అందిస్తున్న ఆరోగ్య పాల ప్యాకేట్ గడువు తేదీలను పరిశీలించి తాజావి ఎప్పుడికవుడు అందించాలన్నారు. అంగన్వాడి కేంద్ర భవనానికి పెయింటింగ్ వేయకపోవడం, నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ భవనంలోని కిటికీలకు వెంటనె మెష్ లు ఏర్పాటు చేయాలని, నిర్వహణ సక్రమంగా చేస్తూ మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని అంగన్వాడి సూపర్వైజర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సృజన్ తేజ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు. అంగన్వాడి సూపర్వైజర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు యువతకు ఎన్ఆర్ఐ చేయుతనివ్వాలి

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

పరకాల నియోజకవర్గ యువత, మహిళలు స్వయం ఉపాధి, ఉద్యోగ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా అధికారులు తోడ్పడాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పరకాల నియోజకవర్గం పరిధిలోని కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్, ట్రైనింగ్ సెంటర్, పాల డెయిరీల ఏర్పాటు, పరకాల నియోజకవర్గ నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే జాబ్ మేళా నిర్వహణ పై హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మహిళలకు ఇస్తున్న కుట్టు శిక్షణ కార్యక్రమం, ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన అంశాలను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను ఎమ్మెల్యేకు వివరించారు. టెక్స్టైల్ పార్క్, పాలడెయిరీకి సంబంధించిన వివరాలను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కౌసల్య దేవి ఎమ్మెల్యేకు తెలియజేశారు. టెక్స్టైల్ పార్క్, పాల డెయిరీల ఏర్పాటు, జాబ్ మేళా తదితర అంశాలపై కలెక్టర్లు, అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. ఈ సమావేశంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు, యువత సంక్షేమం కోసం చేపడుతున్న వివిధ కార్యక్రమాలలో ఎన్నారైల భాగస్వామ్యమయ్యేలా కలెక్టర్లు కృషి చేయాలన్నారు. మహిళలు, యువత ఉపాధి సాధించేలా అధికారులు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సబ్సిడీ పథకాలు అందేలా సమన్వయంతో చర్యలు చెపడదామన్నారు. రైతులతో ఏర్పాటు చేసిన సొసైటీ లు పాడి రంగంలో రాణించే విధంగా పాల డెయిరీల ఏర్పాటు చేయడానికి ముందస్తుగా స్ఫూర్తిగా నిలుస్తున్న ముల్కనూర్ సొసైటీ లో శిక్షణ కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాల రూపకల్పనకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఒక్కో బ్యాచ్ కు రెండు రోజుల పాటు ఇచ్చే శిక్షణలో సొసైటీ నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాల పై రైతు సొసైటీ సభ్యులకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. డెయిరీల ఏర్పాటు కు అనువైన స్థలాలను వెంటనే గుర్తించాలని, అందుకు సంబంధించిన ప్రక్రియ ను పూర్తి చేయాలన్నారు. పాడీలో కొత్త రైతులను ప్రోత్సహించేవిధంగా గుర్తించాలన్నారు. ఆ బాధ్యత ను ఏపీఎంలకు అప్పగించాలన్నారు. రైతులకు వివిధ రకాల ప్రోత్సాహకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నాయని, వాటిని రైతులకు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వచ్చే నెల నాలుగవ తేదీన దామెర మండలానికి రాష్ట్ర ఇటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు హాజరవుతున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో చిన్న తరహా పరిశ్రమల స్థాపన ఉన్న అవకాశాలను అధికారులు పరిశీలించాలని అన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు లభించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకూ దాదాపుగా 3వేల 500మంది ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం నమోదై ఉన్నారని, నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఏప్రిల్ 4వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, ఇందుకు 50 వరకు వివిధ సంస్థలు, కంపెనీలు వస్తున్నాయన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ యువత సద్వినియోగం చేసుకునేలా అధికారులు తోడ్పాటు అందించాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.



## ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్ డాక్టర్ సత్య శారదా



**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని జిల్లా వేర్ హౌజ్ గోదాములలో భద్రపర్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎంల)ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి శనివారం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఈవీఎం గోదాములను కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో తహసీల్దార్ ఇక్బాల్, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ రంజిత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు టిడిపి నుండి శ్యామ్ సుందర్, ఏఐఎంఐఎం నుండి ఫైజొద్దీన్, బిజెపి హరి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## రిలే నిరాహార దీక్షలకు ఆరెపల్లి పవన్ సంఘీభావం



**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

హసన్ పర్తి మండలం తాసిల్దార్ కార్యాలయం ముందు దీక్షలను ఆరెపల్లి పవన్ మాదిగ సందర్శించి తన సంఘీభావాన్ని తెలియజేశారు. ఉద్యోగ నియామకాల్లో మాదిగలకు మాదిగ పకులాలకు న్యాయం చేయాలి. ఆరేపల్లి పవన్ మాదిగ ఎంఎస్పి సీనియర్ నాయకులు అసెంబ్లీ సమావేశాలలో మాదిగల జనాభా దామాష ప్రకారం ఎస్సీల ఏబిసిడి వర్గీకరణను నాలుగు గ్రూపులుగా చేసి ప్రస్తుతం ప్రకటిస్తున్న ఉద్యోగ నియమాకాలలో మాదిగ మరియు ఉప కులాలకు న్యాయం చేయాలని. కాంగ్రెస్ ప్రభుత్వం న్ని డిమాండ్ చేస్తున్నాం. దీక్షలకు ఎమ్మార్పీఎస్ మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పుట్ట రవి మాదిగ సంఘీభావం ప్రకటించారు. ఈ దీక్షలో ఎంఎస్పి జిల్లా ఉపాధ్యక్షులు రాజారపు బిక్షపతి మాదిగ, ఎంఎస్పి సీనియర్ నాయకులు నమ్మిండ్ల సూర్యం మాదిగ, ఎంఎస్పి మండల కన్వీనర్ మంద వీరస్వామి మాదిగ, బండారి అఖిల్ మాదిగ, నమిండ్ల ప్రవీణ్ మాదిగ, బండారి రాము మాదిగ, మాదిగ మహిళా సమాఖ్య అధ్యక్షులు దామెర భాగ్య మాదిగ, ఐలయ్య మాదిగలు పాల్గొన్నారు.

## ఏకశిలా పార్క్‌లో జరగబోయే దీక్షకు మాదిగ ఉద్యోగస్తులు పాల్గొని విజయవంతం చేయండి

**ప్రొఫెసర్ శ్రీనివాస్**



**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

కాకతీయ యూనివర్సిటీలో మాదిగ ఉద్యోగస్తుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ అన్న ఆదేశాల మేరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. హనుమకొండ జిల్లా మాదిగ ఉద్యోగుల సమైక్య ఆధ్వర్యంలో ఈ రోజు ఏకశిలా పార్క్ దగ్గర జరగబోయే దీక్షను మాదిగ ఉద్యోగస్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయగలరు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా యూనివర్సిటీ ఉపాధ్యక్షులు డాక్టర్ పుల్ల శ్రీనివాస్ మాదిగ, ఎంఈఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జ్ మంద రాజు మాదిగ, ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తూరు ప్రభాకర్ మాదగ, ఎంఈఎఫ్ జనరల్ సెక్రెటరీ సుజాత మాదిగ, బొక్క మొగిలి మాదిగ, డాక్టర్ సంగాల ఏప్రిమ్ రాజ్ మాదిగ, రాజ మొగిలి మాదిగ,రణధీర్ మాదిగ, విజయ్ రావు మాదిగ, పున్నం మాదగ తదితరులు పాల్గొన్నారు.

## రాజాసింగ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్,మార్చి15(జై భీమ్ న్యూస్):**

బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ దేశం వదిలిపోయేలా చేస్తామని హెచ్చరించారు. లేదా నేను బీజేపీలో జాయిన్ అవుతానని అసదుద్దీన్ ఒవైసీ తమ నేతల కాళ్లు పట్టుకుంటారని ఎద్దేవా చేశారు. రంజాన్ సందర్భంగా అసదుద్దీన్ ఒవైసీ లేనిపోని కామెంట్స్ చేస్తున్నారని మండిపడ్డారు. యూపీ తరహాలో తెలంగాణలో కూడా జమ్మికి నమాజ్ చేస్తే బాగుంటుంది అన్న యోగి ఆదిత్య నాథ్ మాటలకు అసదుద్దీన్ ఓవైసీకి కౌంటర్ ఇచ్చారు. నిన్న హోలీ ప్రశాంతంగా జరగకుడదని అసద్దుద్దీన్ ఒవైసీ కుట్ర చేశారని ధ్వజమెత్తారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు అందేలా కృషి

**టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ**

**హనుమకొండలో రెండు జిల్లాల కార్యవర్గ సమావేశం**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కోసం పోరాడుతామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ఉద్ఘాటించారు. శనివారం హనుమకొండ బాల సముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో హనుమకొండ, వరంగల్ జిల్లాల టీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. హనుమకొండ జిల్లా అధ్యక్షులు గడ్డం రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విరాహత్ అలీ మాట్లాడుతూ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ ల విషయములో కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని అన్నారు. డెస్క్ జర్నలిస్టులతో సహా అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ అందే విధంగా టీయూడబ్ల్యూజే కృషి చేస్తుందని అన్నారు. నేడు అక్రిడిటేషన్ లు అంగట్లో సరుకుగా మారాయని, గత ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారముగా అక్రిడిటేషన్ నిబంధనలు పెట్టి చిన్న పత్రికలను ఏబీసీడీలుగా వర్గీకరించారని, బాషా ప్రాతిపదిక నిబంధనతో ఉర్దూ పత్రికలకు అన్యాయం చేస్తే కోర్టుకు వెళ్లి ఆ నిబంధనలను తొలగించామని అన్నారు. అలాగే జర్నలిస్టులకు ఆరోగ్య పథకం కావాలని, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని టీయూడబ్ల్యూజే పోరాడుతున్నదని, ఇటీవలే ఆర్థిక శాఖ, ఆరోగ్య శాఖ మంత్రులను కలిసి విన్నవించడం జరిగిందని, ప్రభుత్వ ఉద్యోగులతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా జేహెచ్ఎస్ ప్రారంభించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించారని అన్నారు. ఇప్పటికే ప్రెస్ అకాడమీ ద్వారా మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు లక్ష రూపాయలతో పాటు జర్నలిస్టు భార్యకు ఐదేళ్ల పాటు నెలకు రూ. 3వేల పెన్షన్ అందించడం జరుగుతున్నదని, జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణ కోసం టీయూడబ్ల్యూజే కృషి చేస్తూనే వాటి కుటుంబాలను ఆదుకునేందుకు టీయూడబ్ల్యూజే కృషి చేస్తున్నదన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా జర్నలిస్టుల సంక్షేమం కోసం పోరాడే సంఘం టీయూడబ్ల్యూజే మాత్రమేనని, ఏ ప్రభుత్వానికి భజన చేయలేదు కనుకనే డెబ్బై ఏండ్లుగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్రంలో మొనగాడు సంఘంగా జర్నలిస్టుల గుండెల్లో నిలిందని అన్నారు. డెస్క్ జర్నలిస్టులతో సహా జర్నలిస్టుల అక్రిడిటేషన్ లపై ఇతరులు చేస్తున్న గ్లోబెల్ ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంనారాయణ మాట్లాడుతూ జిల్లాల్లో నిర్మాణ పరంగా టీయూడబ్ల్యూజేను పటిష్ఠం చేయాలని సూచించారు. హైదరాబాద్ తరువాత వరంగల్, హనుమకొండ జిల్లా కేంద్రాలు కీలకమైనవి అని, నిరంతరం జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతూ సంఘం ప్రతిష్టను పెంచాలని సూచించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏదైనా జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ లు అర్హులైన వారందరికీ అందేలా పోరాడాలన్నారు. ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపల్లి మధు, సీనియర్ నాయకులు దాసరి క్రిష్ణా రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు ఎం. రాంచందర్, హనుమకొండ, వరంగల్ జిల్లా కార్యదర్శులు తోట సుధాకర్, మట్టా దుర్గా ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, పి. వేణు మాధవ్, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, జాతీయ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం. రజనీకాంత్, గుంటి విద్యాసాగర్, రెండు జిల్లాల ఆఫీసు బేరర్లు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# ఘనంగా వినియోగదారుల హక్కుల దినోత్సవం

**ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రసంగించారు.**




**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రపంచ వినియోగదారుల హక్కుల 2025 దినోత్సవాన్ని స్థిరమైన జీవనశైలికి ఒక సరైన పరివర్తన అనే అంశంపై వినియోగదారులను చైతన్య పరచుటకు ఐక్యరాజ్యసమితి ఎంపిక చేసిందన్నారు. ఇండస్ట్రియలైజేషన్ గ్లోబలైజేషన్ వల్ల వచ్చిన సమస్యలను అధిగమించినట్లయితే సుస్థిరమైన జీవితం సాగించ వచ్చని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి ముప్పు కలిగించడంతోపాటు ప్రజల ఆరోగ్యానికి హానికరమని, ప్లాస్టిక్ వాడటం వల్ల క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధులు సంభవించి మరణించారని పేర్కొన్నారు. వినియోగదారుల హక్కుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వినియోగదారులకు అవగాహన కల్పించడంలో భాగంగా ఆరోగ్యపరమైన జీవితం సాగించడానికి ప్రతిరోజు చేయాల్సిన వ్యాయామం ప్రాముఖ్యతను కూడా వివరించాలన్నారు. స్థిరమైన జీవనశైలికి మారడం అంటే పర్యావరణం సమాజం, ఆర్థిక వ్యవస్థల పట్ల బాధ్యతతో వ్యవహరించి భవిష్య తరాల కోసం ఒక మెరుగైన ప్రపంచాన్ని సృష్టించడమే అని అన్నారు. స్థిరమైన జీవన శైలికి మారడానికి పర్యావరణానికి హాని కలిగించని ఉత్పత్తులను వాడాలని, స్థానిక, తాజా ఆహారాన్ని వినియోగించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా జాతీయ కమిషన్ సభ్యులు నరసింహారావు, జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి, ఎంవిఐ శోభన్ బాబు, ఎన్పీడీసీఎల్ ఎస్సీ గౌతమ్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, లీడ్ బ్యాంకు మేనేజర్ రాజు, డిసిఐసి, డీసీపీసీ అధ్యక్షులు రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యులు, జిల్లా చౌక ధరల అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు, జిల్లా ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీస్ అధ్యక్షులు, సభ్యులు, పెట్రోల్ బంక్ అసోసియేషన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు

# వినియోగదార్ల హక్కులు రక్షణ చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి







**రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బి. కవిత**

**హన్మకొండ జై భీమ్ న్యూస్:-**

వినియోగదారుల రక్షణ చట్టం పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బి కవిత తెలిపారు. శనివారం హనుమకొండ కాకతీయ గవర్నమెంట్ కాలేజీలో నెహ్రూ యువ కేంద్ర యువజన వ్యవహారాల క్రీడల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, సూపరింటెండెంట్ బానోత్ దేవిలాల్ ఆదేశాల మేరకు వినియోగ దారుని హక్కుల దినోత్స వాన్ని పుర్సకరించుకొని అవగాహన సదస్సు, కాకతీయ గవర్నమెంట్ కాలేజ్ ప్రిన్సిపాల్ రాజా రెడ్డి అధ్యక్షతన పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యంలో జరిగింది. రాజనీతి శాస్త్ర ఆధ్వర్యంలో వినియోగ దారుని హక్కుల అవగాహన పై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగింది. రాజనీతి శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ బి.కవిత వినియోగదారుని హక్కుల గురుంచి అందరికి అవగాహన ఉండాలి అని వినయోగ దారుల రక్షణ చట్టం గురించి ప్రతిఒక్కరు తెలుసుకోవాలి అన్నారు. డాక్టర్ కె, శ్రీ దేవి డాక్టర్ బి.రాజేందర్ ప్రసంగిస్తూ వినియోగదారులు తాము కొనే ప్రతివస్తువు నాణ్యత పై హక్కు కలిగి ఉండాలి ప్రశ్నించే తత్వాన్ని వినియోగదారుల హక్కులు రక్షణను సమర్పించవలసిన అవసరాన్ని గుర్తు చేస్తుంది. వినియోగదారుల వస్తువుల నాణ్యత స్వచ్ఛత ధర ప్రామాణాలకు సంబంధించినది అన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో విజేత లైన విద్యార్థులకు బహుమతులు నెహ్రూయువ కేంద్ర పూర్వపు వాలంటరీ ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షులు మండ రాజేష్, రాజనీతి శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ బి కవిత, రాజనీతి శాస్త్ర ఆచార్యులు డాక్టర్ కె శ్రీదేవి, రాజేందర్ మొదటి బహుమతి వి.శివ, బృందానికి, రెండవ బహుమతి రవికుమార్, అక్షిత బృందానికి ప్రధానం చేయడం జరిగింది.

## భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్న సినీ నటుడు శ్రీకాంత్



**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని శనివారం ఉదయం ప్రముఖ తెలుగు సినీ నటుడు హీరో శ్రీకాంత్ సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన హీరో శ్రీకాంత్ కు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించి ప్రసాదములు అందజేశారు.

## సీఎం సభాస్థలాన్ని పరిశీలించిన సీపీ సన్‌ప్రీత్‌సింగ్



**వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్**

సీఎం రేవంత్‌రెడ్డి స్టేషన్ ఘనపూర్‌లో పర్యటనకు సంబంధించి శివుని పల్లె శివారు ప్రాంతంలో జరిగే బహిరంగ సభకు సంబందించిన ఏర్పాట్లను వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్, ఐపిఎస్ పరిశీలించారు. ముఖ్యంగా హెలిప్యాడ్, సభస్థలి, విఐపి పార్కింగ్, సాధారణ పార్కింగ్ ఏర్పాట్లతో భద్రత ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. సీపీ వెంట డీసీపీ రాజమహేంద్రనాయక్, అదనపు డీసీపీ సురేష్ కుమార్ తో పాటు ఇతర పోలీస్ అధికారులున్నారు.

## మార్చి 18న కేయూలో యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

**పి.డి.ఎస్.యు. కేయూ అధ్యక్షులు బి.బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి వి. కావ్య**

**కెయు లైబ్రరీ ముందు వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ**



**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన యూజీసీ నూతన ముసాయిదాను వ్యతిరేకిస్తూ పి.డి.ఎస్.యు. తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో మార్చి 18న నిర్వహించే యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పి.డి.ఎస్.యు. కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షులు బి.బాలకృష్ణ ప్రధాన కార్యదర్శి వి. కావ్యలు పిలుపునిచ్చారు. శనివారం పి.డి.ఎస్.యు. ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ ముందు రాష్ట్ర సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్స్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా బి. బాలకృష్ణ, వి. కావ్యలు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం యు జి సి నూతన సంస్కరణల పేరిట దేశంలోని విశ్వవిద్యాలయాల మనుగడను స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సుకు విద్యార్థులు, అధ్యాపకులు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. కాకతీయ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు పి.అనూష, గణేష్, సహాయ కార్యదర్శులు యాదగిరి, సాధన, నాయకులు సౌమ్య,శ్రీజ, చారి, నాగరాజు, పెరియార్ తదితరులు పాల్గొన్నారు.

## గిర్నిబావి వద్ద కాల్పులు జరగలేదు

**వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్**



కొమ్మాల జాతర సందర్భంగా గిర్నిబావి ప్రాంతంలో ప్రభ బండ్లును వరుస క్రమంలో తరలి వెళ్లే క్రమంలో కొంత వ్యక్తులు మంది అత్యుత్సాహం ప్రదర్శించడంతో పాటు అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసుల ఆదేశాలను పాటించకుండా సదరు ముందుకు వెళ్లే క్రమంలో పోలీసులకు ప్రభ బండ్లను తరలించే వారి మధ్య తోపులాట మాత్రమే జరిగింది. అంతేకాని ఈ సంఘటన లో ఎలాంటి పోలీస్ కాల్పులు జరగలేదు. కొన్ని ప్రచార మధ్యామాల్లో ఈ సంఘటన లో కాల్పులు జరిగినట్లుగా ప్రజలను ఆందోళన కలిగించే రీతిలో తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నారు. ఎవరైనా ప్రజలను ఆందోళన కలిగించే రీతిలో వార్తలు సామాజిక మధ్యమాల్లో పోస్టులు పెట్టిన, వార్తలు రాసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోబడుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ హెచ్చరించారు.

# తెలంగాణలో ఒక్కో పంచాయతీ సెక్రటరీపై దాదాపుగా రూ.3 లక్షల నుంచి 10 లక్షల దాకా అప్పు

**ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నుంచి ఆగిన నిధులు**
**రెండున్నరేండ్లుగా స్టేట్ ఫైనాన్స్ నిధులూ వస్తలేవు, మెయింటెనెన్స్ పనుల కోసం సొంతంగా ఖర్చుపెడుతున్న కార్యదర్శులు. ఒక్కో సెక్రటరీపై రూ.3 లక్షల నుంచి 10 లక్షల దాకా అప్పు**

**హైదరాబాద్ జై భీమ్ న్యూస్**

రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నుంచి పల్లెలకు రావాల్సిన నిధులు ఆగిపోయాయి. నిరుడు జనవరి నుంచి ఇదే పరిస్థితి. ఇటు రెండున్నరేండ్లుగా రాష్ట్రం నుంచి స్టేట్ ఫైనాన్స్ నిధులు కూడా రావడం లేదు. మరోవైపు ఆస్తిపన్నులు వసూలు కావట్లేదు. దీంతో పంచాయతీల నిర్వహణ భారం కార్యదర్శులపై పడింది. నిధుల్లేక పల్లెల్లో అభివృద్ధి పనులు చేసే పరిస్థితి లేదు. పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, ట్రాక్టర్ మెయింటనెన్స్, డీజిల్, ట్యాంకుల క్లోరినేషన్, బ్లీచింగ్, మోటార్ల రిపేర్ లాంటి పనులకు సెక్రటరీలు తమ జేబుల్లోంచి ఖర్చు చేయాల్సి వస్తున్నది. రెండేండ్లుగా ఇదే పరిస్థితి ఉండడంతో ఒక్కొక్కరు రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా అప్పులు చేశామని కార్యదర్శులు వాపోతున్నారు. అప్పులు తెచ్చి పనులు చేస్తున్నా కొందరు ఉన్నతాధికారులు ఫీల్డ్విజిట్ పేరుతో ఎక్కడో ఓ లోపం పట్టుకొని తమపై చర్యలు తీసుకుంటున్నారని, ఇది ఎంత వరకు సమంజసమని సెక్రటరీలు ప్రశ్నిస్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ మేరకు కనీసం స్టేట్ ఫైనాన్స్ నిధులైనా విడుదల చేసి అప్పుల బాధ నుంచి తమకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

**పంచాయతీలకు రూ.6,500 కోట్లు పెండింగ్..**

పంచాయతీలకు గతేడాది ఫిబ్రవరిలో పాలకవర్గాల గడువు ముగిసింది. ఏడాది దాటినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు ఆగిపోయాయి. అలాగే, కేంద్ర ప్రభుత్వం నుంచి మొత్తం రూ.1,514 కోట్లు పెండింగ్లో ఉన్నాయి. పాలకవర్గాలు కొలువుదీరితే తప్ప ఈ నిధులు వచ్చే పరిస్థితి లేదు. రెండున్నరేండ్లుగా దాదాపు రూ.5 వేల కోట్ల స్టేట్ ఫైనాన్స్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదు. గత బీఆర్ఎస్ హయాం నుంచే ఈ పరిస్థితి ఉంది. అప్పటి సర్పంచులు అప్పు చేసి పల్లెల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టగా, దానికి సంబంధించిన బిల్లులు నేటికీ చెల్లించకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. 15 నెలల కింద కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పంచాయతీలు గాడిన పడ్తాయని అందరూ భావించారు. గతంలో కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులైనా వచ్చేవి. కానీ, ఎన్నికలు జరగకపోవడంతో ఆ నిధులు కూడా రాకపోవడంతో పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడినట్లు అయింది.

**నిర్వహణ భారమంతా కార్యదర్శులదే...**

సర్పంచుల పదవీకాలం ముగియడంతో పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన నడుస్తున్నది. ఒక్కో అధికారికి నాలుగైదు గ్రామాల బాధ్యతలు ఉండడంతో ఇప్పుడు పంచాయతీల నిర్వహణ భారమంతా పంచాయతీ కార్యదర్శులపై పడింది. కేంద్రం, రాష్ట్రాల నుంచి ఫండ్స్ రాకపోవడం, టార్గెట్ మేరకు ఆస్తిపన్నులు వసూలు కాకపోవడంతో కార్యదర్శులే అప్పులు చేసి పంచాయతీలను నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ఇంటింటా చెత్త సేకరణకు ట్రాక్టర్ను గ్రామంలోకి పంపాలంటే అందులో డీజిల్ పోయించాల్సి ఉంటుంది. నెలనెలా డీజిల్కు రూ.10 వేల నుంచి20 వేలకు పైగా ఖర్చుచేయాల్సి వస్తోంది. చాలా గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్లు అందడం లేదు. దీంతో లోకల్గా బోర్లు, మోటార్లు, పైపుల రిపేర్లు చేయించక తప్పట్లేదు. రహదారులపై మొరం పోయించడం, గుంతలు పూడ్చడం, మొక్కలకు నీళ్లు పట్టడం, స్ట్రీట్ లైట్ల నిర్వహణ లాంటి పనులు సరేసరి. ప్రత్యేక అధికారుల పాలనలో ఏ చిన్న మీటింగ్ జరిగినా తమ జేబు నుంచే పెట్టుకోవాల్సి వస్తోందని కార్యదర్శులు వాపోతున్నారు. ఇలా ఒక్కో నెలకు రూ.50 నుంచి రూ.80 వేల వరకు, పెద్ద పంచాయతీలకు రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు మెయింటెనెన్స్ ఖర్చవుతున్నదని చెప్తున్నారు. ఈ క్రమంలోనే ఒక్కొక్కరు రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా అప్పు చేశామని వాపోతున్నారు.

**తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నయ్**

ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పల్లెల్లో సమస్యలు పరిష్కరించలేకపోతున్నం. చాలా మంది సెక్రటరీలు లక్షల్లో అప్పులు తెచ్చి పనులు చేయాల్సి వస్తున్నది. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపో వడంతో ఇబ్బందులు పడ్తున్నరు. వారి కుటుంబాల పోషణ కూడా కష్టంగా మారింది. సర్కారు వెంటనే స్పందించి, ఫండ్స్ విడుదల చేయాలి.

**స్టేట్ఫైనాన్స్నిధులు రిలీజ్ చేయాలి...**

**శ్రీకాంత్, తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు**

జీపీలకు నిధులు రాకపోవడంతో మా జీతాలు పోగా, మీదంగ అప్పులు తెచ్చి పనులు చేస్తున్నం. ట్రాక్టర్ డీజిల్, మోటార్లు, పైపులైన్ల రిపేర్లకు మా జేబులోంచి పెడుతున్నం. కేంద్రం నుంచి నిధులు రాకుంటే కనీసం రాష్ట్ర ప్రభుత్వమైనా స్టేట్ ఫైనాన్స్ నిధులు రిలీజ్ చేయాలి. కార్యదర్శులపై పనిభారం తగ్గించాలి. 2019లో ఉద్యోగంలో చేరిన వాళ్లకు సర్వీస్ కాలం కలిపి, ఒకేసారి రెగ్యులరైజేషన్ డేట్ ఇవ్వాలి.

**– కర్నెకంటి నరేశ్, గ్రేడ్– 4 కార్యదర్శి, భూపాలపల్లి జిల్లా.**

# కనుల పండుగకు వేదికగా మారిన ఇంజనీరింగ్ కళాశాల

**నేడు స్పోర్ట్స్ అండ్ ఫ్లాష్ మాట్**
**సోమవారం ఇంజనీరింగ్ కళాశాల అన్యువల్ "డే"**
**రెండు రోజుల పాటు కొనసాగుతున్న కార్యక్రమం**
**ముఖ్య అతిథిగా కేయూ వీసీ, ప్రత్యేక అతిథిగా కేయూ రిజిస్ట్రార్.**
**ప్రత్యేక అతిధులుగా హనుమకొండ ఏసీపీ కే. దేవేందర్ రెడ్డి, ఇండియన్ హాకీ కోచ్ పి.మధు కరణ్**
**కార్యక్రమానికి అధ్యక్షత వహించనున్న కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రమణారెడ్డి**

**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్:–**

కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాలలో నేటి నుండి రెండు రోజులపాటు కనుల పండుగల నిర్వహించ బడుతున్న కాలేజ్ అన్యువల్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ డే సెలబ్రేషన్స్ ప్రతిష్టాత్మకంగా జరగబోతున్నాయి. విద్యార్థినీ విద్యార్థులలో నూతన ఉత్తేజాన్ని నింపడం కోసం కాలేజ్ డే నిర్వహిస్తున్నట్లు సమాచారం. అధ్యక్షులుగా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య రమణ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఇట్టి కార్యక్రమం. తొలుత ఫ్లాష్ మాట్ తో మొదలవుతూ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యక్రమాలు నిర్వహించబడుతూ సోమవారం అన్యువల్ డే సెలబ్రేషన్స్ నిర్వహించబడతాయని కళాశాల ప్రోగ్రాం నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే ప్రతాప్ రెడ్డి గౌరవ అతిథులుగా కాకతీయ విశ్వవిద్యాల రిజిస్ట్రార్ ఆచార్య, వి. రామ్ చంద్రం ప్రత్యేక అతిథులుగా హనుమకొండ లా అండ్ ఆర్డర్ ఏసీపీ కొత్త. దేవేందర్ రెడ్డితో పాటు ఇండియన్ టీం హాకీ రిటైర్డ్ కోచ్ పి.మధు కరణ్ పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమం నిర్వహణకు అధ్యక్షత వహించనున్న కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ రమణ తో పాటు కళాశాల అధ్యాపక సిబ్బంది, బోధన ,బోదనేతర సిబ్బందితో పాటు సుమారు 1500 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొననున్నారు.

# బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి ఎంపీ బైరెడ్డి శబరి సవాల్

**అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ ఘాటు వ్యాఖ్యలు**

**అమరావతి,మార్చి15(జై భీమ్ న్యూస్):**

వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిపై నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఘాటు వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... 'ఏం అభివృద్ధి చేశారో చర్చించడానికి నేను సిద్ధం. సిద్దార్థ రెడ్డి సిద్దమా' అంటూ ఎంపీ సవాల్ విసిరారు. 'బైరెడ్డి అంటే నేను... సిద్దార్థ రెడ్డి కాదు. కేసులు, అరెస్టుల గురించి సిద్దార్థ రెడ్డి మాట్లాడుతున్నారు.. అసలు అక్క అని చూడకుండా నాపై కేసులు పెట్టించారు.. మా కార్యకర్తలపై దాడులు చేయించారు. ఏనాడూ బయటకు రాని మా అమ్మపై వ్యక్తిగత విమర్శలు చేశారు. నేను మర్చిపోను. జగన్ తల్లిని, చెల్లిని ఎలా చేశారో.. ఇక్కడా అదే చేస్తున్నారు. చాలా రోజులుగా సోషల్ మీడియాలో వ్యూస్ రాలేదని సిద్ధార్థ రెడ్డి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 9 నెలలుగా సిద్దార్థ రెడ్డి ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. కార్యకర్తల గురించి మాట్లాడే హక్కు సిద్ధార్థ రెడ్డికి లేదన్నారు. ఫుల్ బాటిల్ వేయడం బాగా అలవాటైనట్టుంది అని ఎద్దేవా చేశారు. జగన్ మళ్ళీ రావాలని అనుకుంటున్నారని.. అయితే కల్తీ మద్యం, డ్రగ్స్, గంజాయి మళ్లీ రావాలని జగన్ రావాలనుకుంటున్నారా అని నిలదీశారు. వైసీపీ నేతల అవినీతిని తమ ప్రభుత్వం ఖచ్చితంగా బయట పెడుతుందని స్పష్టం చేశారు. సిద్దార్థ రెడ్డి స్క్రిప్ట్ బాగా చదువుతారని.. సినిమాల్లో ట్రై చేసుకుంటే బెటర్ అంటూ ఉచిత సలహా ఇచ్చారు. ఆడుదాం ఆంధ్రాలో అవినీతి బయటికి వస్తుందని... శిక్ష తప్పదని అన్నారు. స్కూలు పిల్లలకు కూడా డ్రగ్స్ అందుబాటులోకి తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ ఒక్కొక్కటి అమలు చేస్తున్నారని తెలిపారు. డైవర్షన్ పాలిటిక్స్ అవసరం లేదని ఎంపీ తెలిపారు. కాగా.. కర్నూలులో హత్యకు గురైన సంజన్న కుటుంబాన్ని ఎంపీ బైరెడ్డి శబరి పరామర్శించారు. ఈ సందర్భంగా భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్నారు బైరెడ్డి శబరి. కక్షలకు, వర్గపోరుకు కుటుంబాలు బలి కాకూడదని.. సంజన్న కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని ఈ సందర్భంగా ఎంపీ అన్నారు. 'నా కుటుంబ సభ్యుడిని నేను కోల్పోయాను. సంజన్న కుటుంబానికి నేను అండగా ఉంటా. ఈ హత్య వెనుక ఉన్న వారిని ఎవరినీ వదలపెట్టను. హత్య చేసిన వారికి టీడీపీకి సంబంధం లేదు. ఇద్దరి మధ్య గొడవ ఉన్నా హత్యలు చేసుకోవడం తగదు. ఖచ్చితంగా అందరికీ శిక్ష పడుతుంది. ఇది ప్రీప్లాన్డ్గా జరిగినట్లు తెలుస్తోంది. ఇంకోసారి ఇలాంటివి జరగకుండా చూస్తాం. హంతకులు ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీకి ఓటు వేయాలని కత్తులు, కొడవల్లతో బెదిరిస్తూ తిరిగారు' అని ఎంపీ బైరెడ్డి శబరి వెల్లడించారు.

# ముఖ్యమంత్రి పర్యటన వేళ ట్రాఫిక్ ఆంక్షలు

**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఘనపూర్ నియోజకవర్గంలోని శివునిపల్లి వద్ద ఈ రోజు ఉన్నందున వాహనదారులకు పోలీసువారు పలుసూచనలు జారీ చేశారు. లింగాల గణపురం మండలంలోని మొత్తం గ్రామాలు నెల్లుట్ల కుందారం కోలుకొండ ఈరంటి గూడూరు ఇప్పగూడెం నుండి వచ్చే వాహనాలు లక్ష్మీ వెంచర్ లో పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. రఘునాథ్ పల్లి మండలం లోని కోమల్ల గోవర్ధనగిరి కుర్చపల్లి గ్రామాల నుండి వచ్చే వాహనాలు వయా రాఘవపూర్ కుర్చపల్లి ఇప్పగూడెం నుండి లక్ష్మీ వెంచర్ లోకి పార్కింగ్ చేసుకోవాలి. రఘునాథపల్లి లోని మిగతా గ్రామాల నుండి వచ్చే వాహనాలు వయ రఘునాథపల్లి కంచనపల్లి ఈరెంటీ గూడూరు ఇప్పగూడెం నుండి లక్ష్మీ వెంచర్ లోకి పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. స్టేషన్ఘన్పూర్ మండలంలోని ఇప్పగూడెం కోమటిగూడెం రంగరాయ గూడెం సముద్రాల గ్రామాల నుండి వచ్చే వాహనాలు వయా ఇప్పగూడెం నుండి లక్ష్మీ వెంచర్ లో పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. స్టేషన్ఘన్పూర్ మండలంలోని చాగల్ కొత్తపల్లి తాటికొండ మీదికొండ రాఘవపూర్ గ్రామాల నుండి వచ్చే వాహనాలు వయా రాఘవపూర్ కూర్చేపల్లి ఇప్పగూడెం నుండి లక్ష్మీ వెంచర్లు పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. స్టేషన్ఘన్పూర్ మండలంలోని తానేదార్పల్లి నుండి వచ్చే వాహనాలు లక్ష్మీ వెంచర్లు పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. స్టేషన్ఘన్పూర్ మండలంలోని మిగతా గ్రామాల నుండి వచ్చే వాహనాలు వయా స్టేషన్ ఘన్పూర్ నుండి లక్ష్మీ రైస్ మిల్ వెనుక భాగంలో పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. జాఫర్ గడ్ మండలంలోని జాఫర్గడ్ ఉప్పుగల్ తిమ్మంపేట తెలుగు తమ్మడపల్లి సాగరం రేగడి తాండ రఘునాథపల్లి ఓబులాపూర్ కోణాయిచలమా దురియతాండ తిమ్మాపూర్ గ్రామాల నుండి వచ్చే వాహనాలు లక్ష్మీ రైస్ వెనుక భాగంలో పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. జాఫర్గడ్ మండలంలోని షాపల్లి హిమ్మత్ నగర్ గ్రామాల నుండి వచ్చే వాహనాలు వయా గూడూరు ఇప్పగూడెం నుండి లక్ష్మీ వెంచర్ల పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. జాఫర్గడ్ మండలంలోని తీగారం సూరారం మాగ్దూంతాండ నుండి వచ్చే వాహనాలు వయా గూడూరు ఇప్పగూడెం నుండి లక్ష్మీ వెంచర్ లో పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుంది చిల్పూర్, ధర్మసాగర్ మండలం, వేలేరు మండలంలోని, అయినవోలు అన్ని హనుమకొండ వైపు నుండి వచ్చే వాహనాలు వయా స్టేషన్ఘన్పూర్ నుండి లక్ష్మీ రైస్ మిల్లు వెనుక భాగంలో పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇట్టి బందోబస్తులో ముగ్గురు డిసిపిలు 2 అడిషనల్ డీసీపీ లు , 20 మంది ఏసీపీలు, 40 మంది సీఐలు, 60 మంది ఎస్ఐలు, మరియు మొత్తం 850 పోలీస్ సిబ్బందితో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఇట్టి బందోబస్తు చేయడం జరుగుతుందని పోలీసులు తెలిపారు.ద

# పవన్కల్యాణ్ మాటలకు చిరంజీవి ఫిదా

**ట్విటర్ వేదికగా పోస్టు**

**అమరావతి,మార్చి15(జై భీమ్ న్యూస్):**

జనసేన పార్టీ ఆవిర్భావ సభలో పవన్ కల్యాణ్ ఇచ్చిన పవర్ ఫుల్ స్పీచ్పై మెగాస్టార్ చిరంజీవి స్పందించారు. తమ్ముడు పవన్ స్పీచ్ చూసి ఫిదా అయిపోయానని అన్నారు. తమ్ముడి స్పీచ్ గురించి చెబుతూ చాలా ఎమోషల్ అయ్యారు. ఈ మేరకు ట్విటర్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'ప్రియమైన నా తమ్ముడు పవన్ కల్యాణ్.. జనసేన పార్టీ ఆవిర్భావ సభలో నువ్వు ఇచ్చిన స్పీచ్ చూసి ఫిదా అయిపోయాను. సభలో పాల్గొన్న అశేష జనసంద్రంలానే నా మనసు కూడా ఉప్పొంగిపోయింది. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే నాయకుడొచ్చాడన్న నమ్మకం మరింత బలపడింది. ప్రజా సంక్షేమం కోసం ఉద్యమస్ఫూర్తితో నీ జైత్రయాత్ర నిర్విఘ్నంగా కొనసాగాలని ఆశీర్వదిస్తున్నాను. జనసైనికులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు. గురువారం పిఠాపురంలో జనసేన పార్టీ ఆవిర్భావ సభ జరిగింది. ఈ సభలో జనసైనికులు, పవన్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభలో పవన్ కల్యాణ్ ఇచ్చిన స్పీచ్, మాట్లాడిన కొన్ని విషయాలు రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా హాట్ టాపిక్ అయ్యాయి. స్పీచ్ మొదట్లోనే పవన్ కల్యాణ్ తెలంగాణ గురించి మాట్లాడారు. ఆంధ్ర గడ్డ మీద జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. నా తెలంగాణ కోటిరతనాల వీణ అంటూ కొనియాడారు. ఆయన మాట్లాడుతూ.. ' కరెంట్ షాక్ తగిలి చనిపోబోయిన నాకు పునర్జన్మనిచ్చింది కొండగట్టు ఆంజనేయ స్వామి దీవెనలు, నా అభిమానుల దీవెనలే. జనసేన పార్టీ జన్మస్థలం తెలంగాణ. నాకు గద్దర్ అంటే అభిమానం. నేను దాశరథి సాహిత్యం చదివి ప్రభావితం అయ్యాను. రుద్రవీణ వాయిస్తా.. అగ్నిధారలు కురిపిస్తా అనే మాటు నిజం చేశాం' అని అన్నారు.

# స్టేషన్ ఘన్పూర్ పోలీస్ స్టేషన్ను సందర్శించి సీపీ



**వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శనివారం స్టేషన్ ఘన్పూర్ పోలీస్ స్టేషన్ ను తొలి సరిగా సందర్శించారు. ఈ రోజు మధ్యాహ్నం పోలీస్ స్టేషన్కు చేరుకున్న పోలీస్ కమిషనర్ ముందుగా స్టేషన్ పరిసరాలు, సిబ్బంది గృహ సముదాయాన్ని పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు శాంతి భద్రతలకు సంబంధించి అక్కడ ఎలాంటి ఫిర్యాదులు వస్తాయి. పోలీస్ స్టేషన్ పనిచేస్తున్న సిబ్బంది వివరాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ ఇన్స్ స్పెక్టర్ వేణు ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో భాగంగా శివుని పల్లె గ్రామ శివారు ప్రాంతంలో జిరిగే బహిరంగ సభకు ఏర్పాటు చేయాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులతో సమీక్షా చేశారు. ఈ సమీక్షలో ప్రధానంగా, సభాస్థలి, హెలిపాడ్ ల వద్ద పోలీస్ బందోబస్త్, అలాగే వాహన పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్దికరణతో సభ తరలి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై సీపీ సంబంధిత పోలీస్ అధికారులతో సమీక్షా జరిపారు.

# జిల్లాలోని 10 మండలాల్లోని 64 పాఠశాలలు వసతి గృహాల్లో స్ఫూర్తి కార్యక్రమం



**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని 10 మండలాల్లోని 64 పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న 6 నుండి 9 తరగతి విద్యార్థులకు స్ఫూర్తి కార్యక్రమం జిల్లా అధికారుల పర్యవేక్షణలో నిర్వహించడం జరిగింది. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆలోచనల మేరకు విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు పెంపొందించేందుకు జిల్లాలో మొట్టమొదటిసారిగా వినూత్న రీతిలో ఈ నెల 8వ తేదీన జిల్లాలో శ్రీకారం చుట్టడం జరిగింది. విద్యార్థులకు అనుభవం కలిగిన రిటైర్డ్ ఉపాధ్యాయులు జిల్లా అధికారుల సమన్వయంతో విద్యార్థులకు ఉద్వేగాలను ఎదుర్కొనే నైపుణ్యాలపై వివరించి వారిలో ఆత్మస్థైర్యం కల్పించడం జరిగింది. ఇదివరకే వరంగల్ జిల్లాలోని 13 మండలాల్లో విద్యానభ్యసిస్తున్న 6 నుండి12 వ తరగతి ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల బాల బాలికలు ప్రతి శనివారం నాలుగు వారాల పాటు స్ఫూర్తి కార్యక్రమాలను నిర్వహించి 10, 12 తరగతి పరీక్షలకు హాజరు అయ్యే విద్యార్థులకు ప్రోత్సహిస్తూ వారికి ఎదురయ్యే సమస్యలు పోటీ తత్వం, అడ్డంకులు, సవాళ్లు, అనుకోని పరిస్థితులు , ఒత్తిడీలు, ఎత్తుగడలు, సమయస్ఫూర్తి తదితర అంశాలపై ఒత్తిడిని జయించి సామర్థ్యాలు పెంపొందించుకోనే విధంగా ఈ కార్యక్రమం ద్వారా వివరించి ప్రోత్సహించడం జరిగింది. ఈ కార్యక్రమాలలో డిఆర్డీఓ కౌసల్యాదేవి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులుగా నియమించిన వివిధ శాఖల జిల్లా అధికారులు ఆయా పాఠశాలల వసతి గృహాల ప్రిన్సిపాల్ లు, రిటైర్డ్ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అదుపుతప్పి ప్రమాదానికి గురైన కారు

**నలుగురు అక్కడికక్కడే దుర్మరణం**

**శ్రీకాకుళం,మార్చి15(జై భీమ్ న్యూస్):**

శ్రీకాకుళం జిల్లాలో శనివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లావేరు మండలం బుడమూరు వద్ద జాతీయ రహదారిపై బైక్ను తప్పించబోయి కారు అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు పాతపట్నం మండలానికి చెందిన వారిగా గుర్తించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు.

# పబ్లిక్ సర్వీసెస్ రూల్స్ మార్పు చేస్తూ ఉత్తర్వులు

**అమరావతి,మార్చి15(జై భీమ్ న్యూస్):**

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్లో భాగంగా ఏపీ పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ గ్యారంటీ రూల్స్ను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. 2018లో తీసుకొచ్చిన ఏపీ పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ గ్యారంటీ రూల్స్ను సవరిస్తున్నట్టు పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ నోటిఫికేషన్ జారీ చేశారు. లిఫ్టులు, ఎస్కలేటర్ల ఉత్పత్తి, ఏర్పాటు లైసెన్సులను 15–21 రోజుల్లోగా జారీ చేసేలా సర్వీస్ డెలివరీ గ్యారంటీ రూల్స్లో మార్పులు చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. పారిశ్రామిక, వాణిజ్య నిర్మాణాల్లో వినియోగించే లిఫ్టులు, ఎస్కలేటర్ల ఉత్పత్తి, బిగింపు, లైసెన్సుల జారీ, రెన్యువల్ తదితర అనుమతుల కోసం ఈ సవరణ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ అంశానికి సంబంధించిన బిల్లును ఇటీవలే ఏపీ శాసనసభ కూడా ఆమోదించింది.

# టీడీపీ కార్యకర్త దారుణ హత్య

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**అమరావతి,మార్చి15(జై భీమ్ న్యూస్) :**

ఏపీలో హత్య రాజకీయాలతో జనం భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. కర్నూలులో టీడీపీ నేత సంజన్న హత్య జరిగి 24 గంటలు గడవక ముందే మరో టీడీపీ కార్యకర్త దారుణ హత్యకు గురయ్యారు. చిత్తూరు జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. జిల్లాలోని పుంగనూరు మండలం కృష్ణాపురంలో టీడీపీ కార్యకర్త రామకృష్ణను ప్రత్యర్థులు కిరాతకంగా హత్య చేశారు. పాత కక్షలతో మాజీ వాలంటీర్, వైసీపీ కార్యకర్త వెంకటరమణ కొడవలితో రామకృష్ణని నరికాడు. తీవ్రంగా గాయపడిన రామకృష్ణను మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. రామకృష్ణ పరిస్థితి విషమించడంతో తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే అతడు కన్నుమూశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పుంగనూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హత్యకు గురైన రామకృష్ణ.. నాలుగైదు రోజుల క్రితం ఓ వీడియోను రిలీజ్ చేశారు. వైసీపీ వ్యక్తుల నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ అందులో తెలిపారు. ఎన్నిసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా వన్ సైడ్‌గా వ్యవహరిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశాడు టీడీపీ కార్యకర్త. వీడియో రిలీజ్ చేసిన నాలుగు రోజుల్లోనే ఈరోజు రామకృష్ణ దారుణ హత్యకు గురవడం సంచలనం రేపింది. కాగా.. అటు కర్నూలులోనూ టీడీపీ నేత సంజన్న దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. జిల్లాలోని శరీన్‌నగర్‌కు చెందిన సంజన్నను కొందరు వ్యక్తులు కత్తులతో నరికి చంపారు. దుండగుల దాడిలో టీడీపీ నేత తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించగా... అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు తెలిపారు. సంజన్న గతంలో వైసీపీలో పనిచేశారు. కాటసాని రాంభూపాల్ రెడ్డితో విబేధాల కారణంగా టీడీపీలో చేరారు. అయితే శరీన్‌నగర్‌కు చెందిన రామాంజనేయులు (అంజి)తో సంజన్నకు కొంతకాలంగా విబేధాలు ఉన్నాయి. ఈ క్రమంలో నిన్న రాత్రి మెడిటేషన్ సెంటర్‌కు వెళ్లి వస్తుండగా.. అంజి, అతడి అనుచరులు దారి కాసి మరీ సంజన్నపై దాడి చేశారు. కత్తులతో కిరాతంగా నరకడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. ఆస్పత్రికి తరలించేలోపే సంజన్న ప్రాణాలు కోల్పోయాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఎలాంటి గొడవలు జరగకుండా శరీన్‌నగర్‌లో పికెటింగ్ ఏర్పాటు చేశారు.

# 15నెల్లో రెండుసార్లు హాజరు

**57లక్షల జీతం మాత్రం జమ**
**కెసిఆర్ గైర్హాజరుపై రేవంత్ మండిపాటు**
**సభకు వచ్చి చర్చల్లో పాల్గొనాలని సూచన**
**రేవంత్ వ్యాఖ్యలకు నిరసనగా మండలిలో బిఆర్ఎస్ వాకౌట్**

**హైదరాబాద్,మార్చి15(జై భీమ్ న్యూస్):**

15 నెలలుగా అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా జీతభత్యాలు పొందుతున్న ఏకైక ప్రతిపక్షనేత కెసిఆర్ అని సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై తెలంగాణ శాసన మండలిలో సీఎం రేవంత్ రెడ్డి సెటైర్లు వేశారు. కేసీఆర్ వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నారా? లేక వర్క్ ఫ్రమ్ ఫామ్‌హౌసా? అంటూ ఎద్దేవా చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై సమాధానం చెబుతూ.. ఎమ్మెల్యేగా కేసీఆర్ ఇప్పటివరకూ రూ.57 లక్షల జీతం తీసుకుని కేవలం రెండు సార్లు మాత్రమే అసెంబ్లీకి వచ్చారని మండిపడ్డారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..'కేసీఆర్ ఆరోగ్యంగా ఉండాలని, అసెంబ్లీకి రావాలని కోరుతున్నా. నిద్రపోయే వారిని లేపొచ్చు కానీ.. నటించే వారిని లేపలేం. సభకు వచ్చి కేసీఆర్ విలువైన సూచనలు ఇవ్వాలి. ఆయన సభకు రాకుండానే లక్షల రూపాయలు జీతంగా తీసుకుంటున్నారు. అసెంబ్లీకి కేసీఆర్ రారు.. ఆయన తన నియోజకవర్గంలోనూ క్షేత్రస్థాయిలో పర్యటించరని అన్నారు. . రైతుల ఆత్మహత్యలకు వారి అప్పులే ప్రధాన కారణం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశాం. ఆరు నెలల్లోనే రూ.25 వేల కోట్ల రుణమాఫీ కింద చెల్లించాం. అన్నదాతలకు క్వింటాల్ వరికి రూ.500 బోనస్ ఇస్తున్నాం. కాళేశ్వరం నుంచి చుక్క నీరు రాకుండానే 1.57 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాంధించాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టింది కాళేశ్వరం కాదు.. కూలేశ్వరం అని ప్రజలే అంటున్నారు. కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులే రైతులకు నీరిస్తున్నాయి. ఎన్నికల కోడ్ సాకుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు ఇవ్వలేదు. మేం అధికారంలోకి వచ్చాక రైతుబంధు చెల్లించాం. భూమి లేని రైతు కూలీలకు ఆత్మీయ భరోసా ఇచ్చాం. రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు ఇచ్చే పథకం తెచ్చాం. కాళేశ్వరం నుంచి చుక్కనీరు లేకుండా రికార్డు స్థాయి పంటలు పండాయి. వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్లే అని గతంలో కేసీఆర్ అన్నారు. కానీ మేం మొత్తం ధాన్యం కొనుగోలు చేశాం. అలాగే మహిళా సాధికారతకు ఎన్నో పథకాలు చేపట్టాం. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. దాని కోసం రూ.1,775 కోట్లు ఖర్చు చేస్తున్నాం. గతంలో కేసీఆర్ ఒక్క మహిళకైనా మంత్రి పదవి ఇచ్చారా?. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే మా లక్ష్యం. మహిళా సంఘాలకు వెయ్యి ఆర్టీసీ అ÷-దదె బస్సులు ఇచ్చాం. వారికి వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్ ఎ÷-లాంట్లు అందిస్తాం. కేసీఆర్ విషయంలో స్ట్రేచర్‌పై మాట్లాడిన మాటలకు కట్టుబడి ఉన్నామని రేవంత్ చెప్పారు. కాగా, తెలంగాణ శాసనమండలిలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తుండగానే బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పెద్దఎత్తున నిరసనకు దిగారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం శాసనమండలి నుంచి బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు.

# బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నాం

**కరీంనగర్ :** రాష్ట్రంలో పాలన అదుపు తప్పిదని.. కాంగ్రెస్‌కు పాలన చేతకావడం లేదని కేంద్ర మంత్రి బండిసంజయ్ అన్నారు. బీజేపీ నేత రాజాసింగ్ కామెంట్స్‌పై బండి సంజయ్ స్పందించారు. బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీల మధ్య రహస్య సమావేశాలు జరిగి ఉండవచ్చని చెప్పారు. రాజాసింగ్ చేసిన కామెంట్లను తాను చూడలేదని బండి సంజయ్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. బీజేపీకి ఎవరితోనూ రహస్య ఎజెండాలు, సమావేశాలు ఉండవని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలు.. బీజేపీని అడిగే ఇచ్చారా అని ప్రశ్నించారు. పంటలు ఎండుతుంటే కాంగ్రెస్‌కు పట్టదా అని నిలదీశారు. బీఆర్ఎస్‌ను జాకీ పెట్టి లేపినా ఇక లేవదని విమర్శించారు. డిలీమిటేషన్‌పై ఎలాంటి నిర్ణయం జరగలేదని అన్నారు. ఒక వర్గం, ప్రాంతం కోసం కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోదని తేల్చిచెప్పారు. కేంద్రం ప్రకటన చేయకముందే ప్రతిపక్షాలు హడావుడి చేస్తున్నాయని అన్నారు. హైదరాబాద్ డ్రగ్స్‌కు అడ్డాగా మారిందని బండి సంజయ్ ఆరోపించారు.

# జర్నలిస్టులు జవాబుదారులు

మొదటి పేజీ తరువాయి

అడుగుతున్నారన్నారు. మీలా కష్టపడి పని చేసే నాయకులెవరో మంత్రి శ్రీధర్ బాబు మినహా పేర్లు చెప్పండి వాళ్ళ జాతక చరిత్ర,వాళ్ల రాజకీయ చరిత్ర మేం బయట పెడతామంటూ జర్నలిస్టు సమాజం సీఎంను కోరుతుందన్నారు.జర్నలిస్టుల హక్కుల పట్ల అసెంబ్లీలో చర్చించాలని ప్రతిపాదించిన సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలపై కూడా ఒక్కొక్క శాసన సభ్యుని లెక్క ప్రకారం చర్చ పెడితే బాగుంటుందంటూ సూచించారు. మొదట ఆంధ్ర జర్నలిస్టులకు పెత్తనం ఇచ్చి పెంచి పోషించి గౌరవ మర్యాదలు ఇస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అంటూ సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా పార్ట్ టైం జర్నలిస్టులకు పెద్దపీట వేస్తున్న ప్రెస్ క్లబ్ యాజమాన్యాలను ఎవరు మందలియ్యాలంటూ కరాకండిగా అడిగారు. రాష్ట్రవ్యాప్తంగా 15 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విచక్షణారహితంగా విరుచుకుపడుతున్న ప్రతిపక్షాల కుట్రలను ఛేదిస్తూ చీల్చి చెండాడుతున్నది ప్రభుత్వం తరఫున బాధ్యత వహిస్తున్న జర్నలిజం కాదా అంటూ గుర్తుచేశారు. మీకు లాగా కష్టపడి పని చేసే నాయకులను రాష్ట్రవ్యాప్తంగా ఇద్దరిని చూపించండి అంటూ తెలంగాణ సమాజం ప్రశ్నిస్తుందన్నారు.అందరిపై ఎందుకు “సార్” అక్కాస్ వెళ్లగక్కడం మహిళలను సోషల్ మీడియాలో కించపరిచిందెవడో పట్టుకొని శిక్షిస్తూ పండబెట్టి తొక్కండి మాకేం అభ్యంతరం లేదంటూ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డిని గౌరవిస్తాం... అభిమానిస్తామ్... ప్రేమిస్తాం ...ప్రశ్నిస్తాం... సందర్భాలను బట్టి వ్యతిరేకిస్తాం అంటూ సీఎంపై తన వ్యక్తిగత అభిమానాన్ని వెలబుచ్చారు.గౌరవ మర్యాదలు ఒకరిపై ఒకరికి ఇచ్చిపుచ్చుకునేవని వాటిని అన్ని విధాలుగా కాపాడుకుంటూ ముందుకు సాగుదామంటూ స్నేహపూర్వక సందేశాన్నిచ్చారు. ప్రజల పట్ల, ప్రజాసేవ పట్ల,అణగారిన వర్గాల సంక్షేమం కొరకు పనిచేసే నాయకులను గౌరవించుకుంటామంటూ వ్యాఖ్యానించారు. ప్రజాసేవకు కట్టుబడి విలువలతో కూడిన సేవలను అందిస్తూ ప్రజలకు మేలు చేయాలని ప్రభుత్వాన్ని అధికారులను నాయకులను కోరినారు. ప్రభుత్వంలో ఉంటూ అత్యంత బాధ్యతగల వ్యక్తులుగా కొనసాగుతూ ప్రజాసేవని విస్మరించి ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తున్న ఎంతటి వారినైనా జర్నలిజం వదిలిపెట్టదంటూ సవాల్ విసిరారు.సీఎంల పని చేయండి ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉండడంటూ తెలంగాణ ప్రజా ప్రతినిధులకు సూచించారు.

# ఫామ్ ల్యాండ్ ఫ్రాడ్

**బుచ్చిబాబు అనే ఏంజెంట్ రైతులను మోసగిస్తున్నాడు**
**బుచ్చిబాబుకు సహకరిస్తున్న మున్సిపల్ రెవెన్యూ రాజకీయ నాయకులెవరు**
**ఇటు తెలంగాణలో ఆటు ఆంధ్రాలో ఫామ్ ల్యాండ్ ఫ్రాడ్ పైచర్య**
**రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకుల అండతో రెచ్చిపోతున్నారు**
**ప్రజల వద్ద సేకరించిన భూమి డబ్బులు లెక్కలు చెప్పండి**
**లాభాల కోసం వ్యాపారం చేస్తున్నారా రైతుల మేలుకోసమా**
**రైతులను మోసగిస్తే సహించేది లేదు**
**డాక్టర్ బరిగెల శివ**







**హైదరాబాద్(జై భీమ్ డెస్క్)**

ఆర్విని ఫార్మ్స్ పేరుమీద బుచ్చిబాబు అనే ఏంజెంట్ జడ్చర్లలో భూ వ్యాపారానికి పాల్పడుతున్న యజమాన్యం హైదరాబాద్ మున్సిపల్ డెవలప్మెంట్ అథారిటీ అనుమతులు లేకుండా రెండు గుంటల చొప్పున ప్లాట్లు నిర్వహిస్తూ సింగల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణంతో కావలసిన ఫర్నిచర్ 24 ఫ్రూట్ ప్లాంట్స్ తో వివిధ రకాల పండ్ల చెట్లను ఆకారంలో చూపిస్తూ వీకెండ్ హెూమ్ మెయింటెనెన్స్,డ్రిప్ ఇరిగేషన్,ప్లాంట్ ప్రొటెక్షన్,క్లబ్ హౌసెస్ పేరు మీద విక్రయాలకు పాల్పడుతుండడం పచ్చి మోసమంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుల భూమిని పెట్టుబడిగా తీసుకొని ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపారానికి పాల్పడుతున్నట్లు రైతులంతా ఆందోళన చెందుతున్నారు. డబ్బులు సంపాదించే క్రమంలో రెవెన్యూ అధికారులు రాజకీయ నాయకులు ఆర్విని ఫార్మ్ హౌస్ యాజమాన్యానికి పూర్తి మద్దతుగా సహకరిస్తూ బలవంతపు మోసాలకు పాల్పడుతున్నట్లుగా రైతులు మనోవేదన చెందుతున్నారు. ఇటు తెలంగాణలో ఆటు ఆంధ్రాలో రెండు చోట్ల ఇదే రకమైన వ్యాపారాన్ని కొనసాగిస్తూ రైతులను, కష్టమర్లను,ప్రజలను వ్యాపారస్తులను మోసం చేస్తూ అధికార యంత్రాంగాన్ని, రాజకీయ యంత్రాన్ని వ్యక్తిగత స్వలాభానికి వాడుకుంటున్న ఫామ్ హౌస్ యజమాన్యంపై చర్యలు చేపట్టాలని రైతుల కోరుతున్నారు. అనుమతులు లేకుండా మూడు ఎకరాలలో కొనసాగించిన వ్యాపారం 30 నుండి 40 ఎకరాలకు పాకిందని దానికి బాధ్యులు ఎవరు అంటూ ప్రజల ప్రశ్నిస్తున్నారు. అనుమతులు లేకున్నప్పటికిని వ్యాపారం చేస్తామంటే కుదరదు అంటూ రైతులు తిరగబడుతున్నారు.లాభ సాయకమైన సహాయం కోసం భూములను ఇచ్చిన రైతులకు మొండి చేయి చూపి ఉడాయించే మార్గంలో యాజమాన్యం ఉంటున్నట్లు రైతులు అనుమానం వ్యక్తపరుస్తున్నారు. నిజాయితీగా రైతులకు మేలు జరిగి, లాభం జరిగి అనుమతులతో కూడిన వ్యాపారం చేస్తే ఎలాంటి ఇబ్బందులు లేవు కానీ దానికి పూర్తి భిన్నంగా వ్యాపారం చేస్తుండడం ముమ్మాటికి తప్పే. రెవెన్యూ అధికారులు కదులుతారా అక్రమంగా కొనసాగుతున్న వ్యాపారాన్ని కట్టడి చేస్తారా వేయి చూడాలి. రైతులకు న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి తీరుతామంటూ ప్రజల హెచ్చరిస్తున్నారు.

# పసుపసు ధరలు పెంచి రైతులను ఆదుకోండి

**కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల లేఖ**

**హైదరాబాద్,మార్చి15(జై భీమ్ న్యూస్) :**

పసుపు ధరలను పెంచి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలనిమంత్రి తుమ్మల నాగేశ్వరరా రావు కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లారు. పసుపు ధర పడిపోయే సూచనలు కనిపిస్తున్నాయం మంత్రి లేఖ రాశారు. రాష్ట్రంలో పసుపు ధరలపై దృష్టి సారించి పసుపు రైతులను ఆదుకోవాలని తుమ్మల లేఖలో కోరారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం కింద పసుపును కొనుగోలు చేయాలని కోరారు. ఎన్ఏఎఫ్ఈడీ ద్వారా మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద పసుపు సేకరణ చేయాలనీ కేంద్రమంత్రి శివరాజ్ చౌహాన్‌ను మంత్రి తుమ్మల కోరారు. రాష్ట్రంలో పసుపు సాగు సుమారు 42,093 ఎకరాలు అని.. 1,25,436 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరిగిందన్నారు. ప్రస్తుతం, పసుపు ధర క్వింటాల్‌కు రూ.17,000 నుంచి రూ.11,000 మధ్య ఉందన్నారు. అయితే ఇది మరింత తగ్గే సూచనలు ఉన్నాయన్నారు. ఇంకా గత సంవత్సరం పసుపు నిల్వలు అమ్ముడుపోలేదని తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో పసుపు ధరల నాణ్యత ఆధారంగా దాదాపు 17? నుంచి 27? వరకు తగ్గాయన్నారు. రైతులను ఆర్థిక నష్టాల నుంచి రక్షించడానికి తక్షణ జోక్యం చేసుకోవాలని వినతి చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సు మేరకు సాగు ఖర్చు ఆధారంగా మార్కెట్ ఇంటర్వెన్షన్ ప్రైస్‌తో ఎన్ఏఎఫ్ఈడీ ద్వారా మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద పసుపును కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలో కోరారు. అంతకు ముందు కూడా కేంద్రమంత్రికి లేఖ రాసిన మంత్రి.. మార్చి నెలలో అధికమొత్తంలో పసుపు పంట మార్కెట్ కు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు నష్టపోకుండా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు. ÷ుగా.. రాష్ట్రంలో పసుపు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. సీజన్ ప్రారంభం నుంచే సరైన గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతున్న పరిస్థితి. అంతేకాకుండా మార్కెట్‌లో దోపిడీకి అంతేలేకుండా పోయింది. చాలా ఏళ్ల నుంచి పసుపు సాగు చేస్తున్నప్పటికీ ఇల్లాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని రైతులు వాపోతున్నారు. పసుపుకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ రైతులు రో÷-డడెక్కి ధర్నాలు కూడా చేశారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని.. పసుపుకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# తరచూ రాహుల్ వియత్నాం పర్యటన

**ఆ దేశంపై ఎందుకంత ప్రేమో**
**విమర్శలు గుప్పించిన బిజెపి**

**న్యూఢిల్లీ,మార్చి15(జై భీమ్ న్యూస్):**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలను లక్ష్యంగా చేసుకుని భాజపా మరోసారి విమర్శలు గుప్పించింది. కొంతకాలంగా ఆయన తరచూ వియత్నాం వెళ్తున్నారని.. ఒక్కసారిగా ఆ దేశం పట్ల అంత అనురాగం ఎందుకు కలిగిందని ప్రశ్నించింది. సొంత నియోజకవర్గంలో కన్నా వియత్నాంలోనే ఆయన ఎక్కువ సమయం గడుపుతున్నారని భాజపా నేత, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ మీడియా సమావేశంలో విమర్శించారు. 'రాహుల్ గాంధీ ఎక్కడ ఉన్నారు? వియత్నాం వెళ్లారని విన్నాను. తన సొంత నియోజకవర్గం రాయ్‌బరేలీలోనూ ఆయన ఇన్ని రోజులు ఉండటం లేదు. తరచూ ఆ దేశాన్ని సందర్శిస్తుండటం ఆసక్తికరంగా ఉంది. నూతన ఏడాది సమయంలోనూ వియత్నాంలో ఉన్నారు. దాదాపు 22 రోజులు అక్కడ గడిపారు. ఆ దేశం పట్ల హఠాత్తుగా అంత ప్రేమ ఎందుకు పుట్టుకొచ్చిందో చెప్పాలి' అని రవిశంకర్ ప్రసాద్ వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నేతగా ఆయన భారత్‌లో అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలను భాజపా చాలా కాలంగా రాజకీయ అస్త్రాలుగా మలుచుకుంటోంది. గతేడాది డిసెంబరులోనూ ఆయన వియత్నాం పర్యటనపై విరుచుకుపడింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంపై దేశమంతా సంతాపం వ్యక్తం చేస్తున్న వేళ.. కొత్త సంవత్సరం కోసం వియత్నాం వెళ్లారని ఆరోపించింది. కాంగ్రెస్ మాత్రం వీటిని కొట్టిపారేసింది. ఆయన ప్రైవేటు పర్యటనలను భాజపా రాజకీయం చేస్తోందని, ఒక వ్యక్తిగా ఆయనకు విదేశాలకు వెళ్లే హక్కు ఉందని స్పష్టం చేసింది.

# జన జీవనంలోకి మావోయిస్టులు

**భద్రాద్రి కొత్తగూడెం,మార్చి15(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ, ఛత్తీస్‌గడ్ సరిహద్దులో మావోయిస్టు పార్టీలో పని చేసే 64 మంది భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ కార్యాలయంలో లొంగిపోయారు. వీరిలో ఏసీఎం సభ్యులు సహా పార్టీ సభ్యులు ఉన్నారు. పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న పనులకు ఆకర్షితులై పెద్ద ఎత్తున మావోయిస్టులు లొంగిపోయారని ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. దీనికి జిల్లా ఎస్పీ, సీఆర్?పీఎఫ్? వారు సంయుక్తంగా కృషి చేశారని అన్నారు. లొంగిపోయిన 64 మందిలో 48 మంది పురుషులు, 16 మంది స్త్రీలు ఉన్నారు. లొంగిపోయిన వారందరికీ ఒక్కొక్కరికి రూ.25,000 చొప్పున మొత్తం రూ.16 లక్షలు అందజేశారు. పునరావాసంతో పాటు పని, భూమి కల్పిస్తామని ఐజీపీ హామీ ఇచ్చారు. తెలంగాణ సరిహద్దులో ఇంకా 95 మందికి పైగా మావోయిస్టులు ఉన్నారని సమాచారం ఉందని, వారు కూడా లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. ఎస్పీ, సీఆర్?పీఎఫ్? సిబ్బంది, పోలీస్ సిబ్బందిని ఐజీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం ఏఎస్పీ, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈరోజు మాకు ముఖ్యమైన రోజు. 64 మంది మావోయిస్టులు వారి ఉద్యమాన్ని వదిలేసి, జన జీవన స్రవంతిలో కలిసి పోతున్నారు. వీరిలో 48 మంది పురుషులు, 16 మంది స్త్రీలు ఉన్నారు. లొంగిపోయిన వారందరికీ ఒక్కొక్కరికి రూ.25,000 చొప్పున ఇస్తున్నాం. మిగిలిన మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని కోరుతున్నామని ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

# రెండోసారి మళ్లీ నేనే ముఖ్యమంత్రిని

**చేసిన అభివృద్ధి పనులే గెలిపిస్తాయి**
**జర్నలిజం ముసుగులో విషసంస్కృతి**
**సమాజానికి చీడపురుగులా తయారైయ్యారు**
**ఇష్టం వచ్చినట్టు మాట్లాడే వాళ్లు జర్నలిస్టులా?**
**వాళ్ల కామెంట్స్ చూస్తుంటే రక్తం మరిగిపోతుంది**
**ప్రజాజీవితంలో ఉన్నాం కాబట్టి ఊరుకుంటున్నాం**
**లేకుంటే పరిస్థితి ఇంకోలా ఉంటుంది**
**మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్,మార్చి15(జై భీమ్ న్యూస్):**

రెండో సారి కూడా తానే ముఖ్యమంత్రి అవుతానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనమండలి వాయిదా అనంతరం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'మొదటి సారి భారాసపై వ్యతిరేకతతో ఓటు వేశారు. రెండో సారి మా మీద నమ్మకంతో ప్రజలు ఓటేస్తారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు శాయశక్తులా కృషి చేస్తా. ఇచ్చిన ప్రతి హామీ అమలుచేసి ప్రజల వద్దకు వెళతాం. సంక్షేమ పథకాల లబ్దిదారులే మా ఓటర్లు అని అన్నారు. నేను పనిని నమ్ముకొని ముందుకు వెళ్తున్నా. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటాం. స్టేచర్ కాదు స్టేట్ ఫ్యూచర్ నాకు ముఖ్యం అన్నారు.. 25 లక్షల మందికిపైగా రైతులకు రుణమాఫీ జరిగింది. కోటి మంది మహిళలకు కచ్చితంగా లబ్ది చేకూరుస్తాం. వారంతా ఇప్పుడు మాట్లాడకపోయినా ఓటు మాకే వేస్తారు. గతంలో నేను చెప్పింది జరిగింది.. భవిష్యత్‌లోనూ నేను చెప్పిందే జరుగుతుంది. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు త్వరలో చెల్లిస్తాం. వచ్చే ఆర్థిక సంవత్సరంలోపు వందశాతం బకాయిలు చెల్లిస్తాం. ఆదాయాన్ని పెంచి..పేదలకు పంచడమే మా విధానం' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చ్చిన ప్రతి హామీ అమలు చేసి ప్రజల వద్దకు వెళతానని ఆయన శాసనమండలిలో మీడియాతో ముచ్చటించిన సందర్భంలో అన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తానని రేవంత్ చెప్పారు. . తాను పనిని నమ్ముకుని ముందుకు వెళుతున్నానని, సంక్షేమ పథకాల లబ్దిదారులే తమ ఓటర్లని సీఎం రేవంత్ అన్నారు. ఇప్పుడు ప్రజలు తనను నమ్మి మళ్లీ గెలిపిస్తారని రేవంత్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి శాయశక్తుల కృషి చేస్తానని చెప్పారు. తెలంగాణలో కోటి మంది మహిళలకు కచ్చితంగా లబ్ది చేకూరుస్తానని సీఎం హామీ ఇచ్చారు. మహిళలు ఇప్పుడు మాట్లాడకపోయినా ఓటు తమకే వేస్తారని సీఎం నమ్మకంగా చెప్పారు. గతంలో తాను చెప్పిందే జరిగిందని, భవిష్యత్?లో కూడా తాను చెప్పిందే జరుగుతుందని రేవంత్ చెప్పారు. జనాభా లెక్కలపై కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ అంచనాలు అడిగిందని, 2027లో జనాభా లెక్కలు నోటిపై చేస్తారని అంటున్నారని సీఎం రేవంత్ తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలు నష్టపోకుండా ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తొలిసారి బీఆర్‌ఎస్‌పై వ్యతిరేకతతో ప్రజలు తమకు ఓటేసినా, రెండోసారి తమపై ప్రేమతో ఓటు వేస్తారని సీఎం రేవంత్ చెప్పడం గమనార్హం. తెలంగాణలో ఇష్టం వచ్చినట్టు మాట్లాడే వ్యక్తులు జర్నలిస్టులు ఎలా అవుతారని ప్రశ్నించారు రేవంత్ రెడ్డి. ప్రభుత్వం గుర్తించిన పత్రికలు, మీడియా సంస్థలు, అక్కడ పని చేసే ప్రతినిధులు జర్నలిస్టులా లేకా కుటుంబాలపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడే వాళ్లు జర్నలిస్టులా అని ప్రశ్నించారు. వాళ్ల కామెంట్స్ చూస్తుంటే రక్తం మరిగిపోతుందని అన్నారు. ప్రజాజీవితంలో ఉన్నాం కాబట్టి ఊరుకొని ఉంటున్నామని అన్నారు. లేకుంటే పరిస్థితి ఇంకోలా ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు. గతంలో ఛానల్స్ ఏదో సెటైరిక్ స్టోరీలు వేస్తే వాటిని ఆ ఛానల్స్‌ను కేసీఆర్ ఏడాది పాటు బ్యాన్ చేశారని గుర్తు చేశారు. అలాంటిది తాము ఎవర్నీ ఏమి అనడం లేదని తెలిపారు. కానీ జర్నలిజం ముసుగులో కొందరు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని వాటిని చూస్తుంటే రక్తం మరిగిపోతుందని అన్నారు. అసలు జర్నలిస్టులు అంటే ఎవరని... వారిని అలా గుర్తింపు ఇచ్చింది ఎవరని ప్రశ్నించారు. జర్నలిస్టు ముసుగులో చేసే కామెంట్స్‌పై అందరూ స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి కొన్ని రెగ్యులరేషన్స్ తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఇదో విష సంస్కృతిలా మారిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇష్టం వచ్చినట్టు కామెంట్స్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటే చాలా బాధ కలుగుతుందన్నారు రేవంత్. అందుకే దీనిపై అందరూ బాధ్యతగా స్పందించాలని సూచించారు. అవసరమైతే చట్టం తీసుకొచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. జర్నలిస్టు సంఘాలతో మాట్లాడాలని సూచించారు. జర్నలిజం ముసుగులో కొందరు చేసే వ్యక్తిగత కామెంట్స్‌ను చూస్తుంటే తనతోపాటు చాలా మంది బాధపడుతున్నారని అన్నారు రేవంత్. ఇదే విషయం ప్రజలకు పార్టీ కార్యర్తలకు తెలిస్తే బట్టలూడదీ రోడ్డుపైకి తీసుకొచ్చి కొడతారని హెచ్చరించారు. నీచమైన భాషతో వాళ్లు చేసే కామెంట్స్‌లో తన పేరు తీసేసి వాళ్లను ప్రోత్సహించే వాళ్ల పేర్లు పెట్టుకొని చూడలని సూచించారు. ఆ బాధ ఏంటో అప్పుడు తెలుస్తుందన్నారు. ప్రజాజీవితంలో ఉన్నాం కాబట్టి చూసీచూడనట్టు వెళ్లిపోతున్నామని ఇకపై ఉపేక్షిస్తే ఇది మరింత పెచ్చురిల్లితుందని ఆందోళన వ్యక్తం చేశారుజర్నలిస్టులపై అసెంబ్లీలో రేవంత్ చేసిన కామెంట్స్ ఆయన మాటల్లోనే...... "పెయిడ్ ఆర్టిస్టులను తెచ్చి వాటిని రికార్డు చేసి సోషల్ మీడియా పెడితే వాళ్లపై పోలీసులు కేసులు పెడితే మీకు దుఃఖం వస్తుంది. సోషల్ మీడియాలో పెట్టిన ఆ భాషను ఒక్కసారి చూడండి అధ్యక్ష. 2014లో కొత్తగా ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేసినప్పుడు ఛానల్స్‌లో ఏదో వెటకారంతో ఏదో వేస్తే ఏడాది బ్యాన్ చేశారు. చాలా మందిని జైల్లో పెట్టారు. ఇవాళ జైలుకు వెళ్లిన అమ్మాయి కూడా అప్పట్లో జైలుకు పోయి వచ్చారు. ఎవరు జర్నలిస్టులు అని నేను ఈ వేదికపై నుంచి అడగదలచుకున్నాను. ఐఅండ్‌పీఆర్ లేదా డీఐబీపీ ఆమోదించిన పత్రికలు ప్రసార సాధనాలు, వాళ్లు ఇచ్చే ఐడీ కార్డులు ఉన్న వాళ్లు జర్నలిస్టులా? ఎవడు పడితే వాడు ఏదో ట్యూబ్ పెట్టుకొని ఇష్టారాజ్యంగా అధ్యక్షా... ప్రజా జీవితంలో ఉన్నాం కాబట్టి ఓపిక పడతున్నాం అధ్యక్షా... రక్తం మరుగుతుంది. ఏందా భాష అధ్యక్షా? నిజంగా మీరు మనుషులా అని అడగదలుచుకున్నాం. మీకు భార్య బిడ్డలు లేరా? తల్లిదండ్రులు లేరా, మీ అమ్మనో చెల్లినో ఇలా అంటే వింటారా అని నేను అడుగుతున్నాను ఈ అరెస్టును ఖండించినవాడిని. నా భార్యను బిడ్డను తిడుతుంటే నాకు నొప్పి అవుతుంది కానీ ఓ ఆడపిల్లను అవమానిస్తుంటే నీకు నొప్పిలేదా? మీరుఏ సంస్కృతిలో ఉన్నారని అడుగుతున్నాను. తోలు తీస్తాను ఒక్కొక్కడ్ని ముఖ్యమంత్రిగా చెబుతున్నాను. బట్టలు విప్పి రోడ్డు మీద తిప్పిస్తా. ప్రజాజీవితంలో ఉన్న మమ్మల్ని విమర్శించండి. విశ్లేషించండి. మా గురించి మాట్లాడండి. ఇంట్లో ఉన్న ఆడబిడ్డల గురించి మాట్లాడే సంస్కృతి ఎక్కడి నుంచి వచ్చింది. తెలంగాణ సమాజం ఇదేనా. ఈ చైతన్య ప్రాంతంలో ఎదురించి నిలబడిన వాడే మొనగాడు. ఆధిపత్యంపై కొట్లాడిన గడ్డ ఇది. ఈ సంస్కృతిని సర్వనాశనం చేసి విష సంస్కృతిని నోటికి వచ్చిన మాట్లాడించి వాటిని పోస్టు చేయించి ఇదేం పైశాచిక ఆనందం. వాళ్లు తిట్టిన తిట్లకు నా పేరు తీసి మీరు పెట్టండి. మీకు అన్నం తినబుద్ధి అవుతుందేమో చూస్తాను. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అయితే బలహీనమైపోయినట్టా అధ్యక్ష. అట్లా అనుకుంటున్నారా. ఓపిక పట్టిన. ఇంకా ఎంతమంది ఉన్నారో తెలియదు. నాకు చికాకు వచ్చిందని తెల్వదు. లక్షల మంది రోడ్లపైకి వచ్చి బట్టలిప్పదీసి కొడతారు. నేను వద్దంటున్నా కాబట్టి చట్టంపై గౌరవం ఉంది కాబట్టి ఏమనకుండా ఊరుకుంటున్నాం. చంద్రశేఖర్‌రావు మీ పిల్లలకు చెప్పుఇది మంచిది కాదు. మానసికంగా కుంగదీసి దెబ్బ తీయొచ్చని అనుకుంటున్నారేమో. అలా కుదరుదు. హద్దుదాటితే, మాట జారితే ఫలితం ఎలా ఉంటుందో మీరు అనుభవిస్తారు. పదవి ఎంతకాలం ఉందనేది కాదు. ఎట్ల ఉన్నామో అన్నదే నేను లెక్కగడతా. ఆత్మగౌరవం చంపుకొని లాలూచి పడి రాజకీయం నేను చేయను అధ్యక్ష. ఉన్నతం కాలం నిటారుగా ఉంటా, ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోను. అవసరం అయితే చట్టాన్ని సవరించే పని చేస్తాం. ఆడపిల్లలు ఆ రకమైన భాషను వాడి సోషల్ మీడియాలో పోస్టు చేస్తే ఇది మంచిదా అధ్యక్ష. తెలంగాణ ఇలాంటి సంప్రదాయం ఉందా అధ్యక్ష. తెలంగాణ ఉద్యం పీక్‌లో ఉన్నప్పుడు కూడా ఇలాంటి భాషా ప్రయోగం జరగలేదు. వీటిని క్షమించే సమస్య లేదు. చంద్రశేఖర్ రావు వినండి మీ పిల్లలకు చెప్పండి. ఇలాంటి సంస్కృతిని భవిష్యత్ తరాలకు ఇవ్వదలుచుకోలేదు. ఇక్కడనే ఉప్పుపాతరేయదలుచుకున్నాను. ఎవర్నీ వదలను. ప్రజాస్వామ్యయుతంగా విమర్శించండి. సరిద్దికోవడానికి సిద్ధంగా ఉన్నాం. గౌరవిస్తాం. దీనిపై చర్చ జరగాలి. జర్నలిస్టు సంఘాలు కూడా ముందుకు రావాలి. జర్నలిస్టు అనే పదానికి అర్థమేంటో ఇవ్వండి.... ఆలిస్టు కూడా ఇవ్వండి. ఆ లిస్టులో ఉన్న వాళ్లు ఇలాంటి తప్పులు చేస్తే ఏం శిక్ష వేస్తారో మీరు నిర్ణయించండి. ఆ లిస్టులో లేనోళ్లు జర్నలిస్టు కాదు. వాళ్లను క్రిమినల్‌గానే చూస్తాం. ఆ క్రిమినల్స్‌ను ఎట్లా జవాలు చెప్పాలో అట్లానే చెబుతాం. ముసుగేసుకొని వస్తే ముసుగు ఊడబీకి బట్టలూడదీసి కొడతాం. తమాషా చేయొద్దు. అన్నిచట్టపరిధిలోనే చేస్తాం. చట్టాని ఎక్కడా దాటబోం. ప్రతి దానికి ఒక శిక్ష, విధానం ఉంది.విశృంఖలత్వాన్ని ఆపాలి. తెలంగాణ సమాజానికి చీడపురుగులా మారుతుంది. దాని నియంత్రణకు చట్టం చేద్దామని అన్నారు.

# అమెరికాలో తుపాన్ బీభత్సం..

**విరుచుకు పడుతున్న టోర్నడోలు..**
**ఐదుగురు దుర్మరణం**

**టెక్సాస్,మార్చి15(జై భీమ్ న్యూస్):**

అమెరికా పెను తుపాన్ కారణంగా గజగజా వణికిపోతోంది. పెద్దెత్తున టోర్నడోలు విరుచుకుపడుతున్నాయి. దుమ్ముధూళితో కూడిన బలమైన గాలులు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఆయా రాష్ట్రాల్లో 100కుపైగా కార్చిచ్చులు చెలరేగాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఇప్పటి వరకు ఐదుగురు మరణించినట్లు అక్కడి అధికారులు తెలిపారు. మిస్సోరీలో బేకర్స్ ఫీల్డ్ ప్రాంతంలో టోర్నడో ధాటికి ఇద్దరు మరణించగా..పలువురికి గాయాలైనట్లు అధికారులు వెల్లడించారు. టెక్సాస్ పాన్ హ్యాండిల్ లోని అమరిల్లో కౌంటీలో మరో ముగ్గురు మరణించారు. మిస్సోరీలో టోర్నడోలు బెంబేలెత్తిస్తున్నాయి. దీంతో స్థానికంగా పలు భవనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అలబామా, కెంటకీ, మిసిసిపీ, టెనసీ, ఇల్లినోయి, ఇండియానా, టెక్సాస్, టెన్నెసీ రాష్ట్రాలకు టోర్నడోల ముప్పు పొంచి ఉందని జాతీయ వాతావరణ సేవల విభాగం ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. కెనడా సరిహద్దు నుంచి టెక్సాస్ వరకు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని అక్కడి వాతావరణ శాఖ అంచనా వేసింది. ఓక్లహోమా, మిస్సోరీ, న్యూ మెక్సికో, టెక్సాస్, కాన్సస్ లలో కార్చిచ్చులు చెలరేగడంతో ఆయా ప్రాంతాల నుంచి ఖాళీ చేయాలని నివాసితులను ఆదేశించింది. అటు మిన్నెసొటా, సౌత్ డకోటాలోని కొన్ని ప్రాంతాలకు మంచు తుపాన్ ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మార్చిలో ఇలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు అసాధారణమేమీ కాదని..అయితే ఈసారి విస్తృతి, తీవ్రత అధికంగా ఉందని జాతీయ వాతావరణ సేవల విభాగం నిపుణులు తెలిపారు.

# కేసీఆర్ అసెంబ్లీకి వస్తే కృష్ణా జలాలపై చర్చ పెడదాం

**కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్**

**హైదరాబాద్,మార్చి15(జై భీమ్ న్యూస్):**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చినప్పుడే కృష్ణా జలాలపై చర్చ పెడదామని అన్నారు. తాము తప్పు మాట్లాడినట్లు తేలితే క్షమాపణలు చెప్పేందుకు కూడా సిద్ధమని స్పష్టం చేశారు. శనివారం అసెంబ్లీలో సీఎం మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా కేసీఆర్‌కు రూ.54.84 లక్షల జీతం ఇచ్చారని.. కానీ ఇప్పటి వరకు కేసీఆర్ రెండు సార్లు మాత్రమే అసెంబ్లీకి వచ్చారని తెలిపారు. రోజా ఇంట్లో కేసీఆర్ రొయ్యల పులుసు తిని.. రాయలసీమను రతనాల సీమ చేస్తామన్నారని గుర్తుచేశారు. ఒక్కసారి రొయ్యల పులుసు పెడితేనే రాయలసీమను రతనాల సీమ చేస్తా అని అన్నారని.. కానీ గుండెల్లో పెట్టుకుని మహబూబ్‌నగర్ ప్రజలు రాజకీయ భిక్షపెడితే గుండెల మీద తంతారా అని, ఎంపీగా గెలిపించిన పాలమూరు ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలోనే సాగర్‌కు సీఆర్‌పీఎఫ్ బలగాలు వచ్చాయని చెప్పుకొచ్చారు. అప్పుడు సైలెంట్‌గా ఉన్న బీఆర్‌ఎస్.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తప్పుబడుతోందంటూ రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా నీటి విషయంలో రాష్ట్రానికి మరణశాసనం రాశారన్నారు. కేసీఆర్ కేంద్రమంత్రిగా ఉన్నప్పుడే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచారని గుర్తుచేశారు. కమీషన్ల కోసమే జూరాల నుంచి తీసుకోవాల్సిన నీళ్లను శ్రీశైలం బ్యాక్ వాటర్ ద్వారా తీసుకుంటామన్నది నిజం కాదా అని నిలదీశారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ఉమ్మడి రాష్ట్రంలోనే 20 కి.మీ మేర పూర్తి చేశారని తెలిపారు. కేసీఆర్ పాలనలో ప్రాజెక్ట్ పనులే చేపట్టలేదన్నారు. ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదంపై సానుభూతి చూపించాల్సిన బీఆర్‌ఎస్ నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారంటూ మండిపడ్డారు. 'మీ స్టేచర్ గురించి ఉన్న ఆలోచన స్టేట్ ఫ్యూచర్ మీద లేదా. బీఆర్‌ఎస్ ఇప్పుడు మార్చురీలో ఉందని అన్నా.. తప్పేముంది. నేను కేసీఆర్‌ను కించపరిచినట్టు కేటీఆర్, హరీష్ రావు విమర్శిస్తున్నారు. కేసీఆర్ వందేళ్లు జీవించి ప్రతిపక్షంలోనే ఉండాలని కోరుకుంటున్నా' అంటూ సీఎం వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగ స్ఫూర్తితోనే వ్యవస్థలు ఏర్పడ్డాయని సీఎం అన్నారు. 2022 బడ్జెట్ సమావేశాలు గవర్నర్ ప్రసంగం లేకుండానే ప్రారంభించారని గుర్తుచేశారు. గత ప్రభుత్వానికి ప్రజాస్వామ్య విలువలు పాటించలేదని విమర్శించారు. మహిళా గవర్నర్‌ను గత ప్రభుత్వం అవమానించిందన్నారు. గవర్నర్ ప్రసంగం గాంధీభవన్‌లో కార్యకర్త ప్రసంగంలా ఉందని కొందరు తమ అజ్ఞానాన్ని బయట పెట్టుకున్నారని మండిపడ్డారు. గవర్నర్ ప్రసంగం కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా ఉండదని.. తమ కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజాపాలన అని స్పష్టం చేశారు. ప్రభుత్వాలు వ్యక్తుల ఆస్తి కాదన్నారు. బలహీనవర్గాలకు చెందిన మహిళా గవర్నర్‌ను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవహేళన చేసిందంటూ వ్యాఖ్యలు చేశారు సీఎం. అయితే సీఎం మాట్లాడుతున్న సమయంలోనే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. కేసీఆర్‌పై సీఎం వ్యాఖ్యలకు నిరసనగా వాకౌట్ చేశారు. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం ప్రసంగాన్ని వినబోమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. బీఆర్‌ఎస్ నేతలు ఇలాగే వ్యవహరిస్తే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సున్నానే మిగులుతుందంటూ ఎద్దేవా చేశారు. కేబినెట్ ఆమోదం పొందిన అంశాలే గవర్నర్ ప్రసంగంలో ఉంటాయని తెలిపారు. కనీస అవగాహన లేకుండా విపక్ష నేతలు మాట్లాడుతున్నారన్నారు. ప్రజల కోసం విపక్షాలు సూచనలు చేస్తే స్వీకరిస్తామన్నారు. గత ప్రభుత్వం కేబినెట్ ఆమోదం లేకుండానే గవర్నర్ ప్రసంగం ఉందా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్‌కు గవర్నర్ వ్యవస్థపై నమ్మకం లేదన్నారు. అప్పులతోనే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. మొదటి ఏడాదిలోనే రూ.20 వేల కోట్లకుపైగా రుణమాఫీ చేశామన్నారు. మార్చి 31 నాటికి రైతులందరికీ రైతు భరోసా ఇస్తామని స్పష్టం చేశారు. భూమి లేని రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తున్నామన్నారు. రైతుల నుంచి ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేస్తామని వెల్లడించారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చామన్నారు. గతంలో ఎక్కడ పంట పండినా కాళేశ్వరం వల్లే అన్నారని.. కానీ కాళేశ్వరం నీళ్లు లేకున్నా రికార్డ్ స్థాయిలో ధాన్యం పండిందని తెలిపారు. గత ప్రభుత్వం మిల్లర్లతో కుమ్మక్కై రైతులకు అన్యాయం చేసిందన్నారు. వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్టే అని కేసీఆర్ అనలేదా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

# భానుడు భగభగలు..

**రోజురోజుకూ మండిపోతున్న ఎండలు**
**పలు జిల్లాల్లో 41 డిగ్రీల ఉష్ణోగ్రలు నమోదు**



**హైదరాబాద్,మార్చి15(జై భీమ్ న్యూస్):**

తెలుగు రాష్ట్రాల్లో రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. భానుడు భగభగలతో పలు జిల్లాల్లో ఉష్ణోగ్రలు 41 డిగ్రీలు దాటుతున్నాయి. ఇవాళ, రేపు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ మేరకు హైదరాబాద్, అమరావతి వాతావరణ కేంద్రాలు కీలక ప్రకటన విడుదల చేశాయి. ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని.. బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. దిగువ ట్రోపోఆవరణములో ఆంధ్రప్రదేశ్ – యానాంలో ఆగ్నేయ, నైరుతి దిశగా దిశగా గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు ఈ కింది విధంగా ఉన్నాయి.ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ – యానాం:- శనివారం, ఆదివారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. వేడి, తేమతో కూడిన అసౌకర్యమైన వాతావరణము ఏర్పడే ఉంది. సోమవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. గరిష్ట ఉష్ణోగ్గతలు క్రమముగా 2 నుండి 3 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యే అవకాశముంది. దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ :- శనివారం, ఆదివారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. వేడి, తేమతో కూడిన అసౌకర్యమైన వాతావరణము ఏర్పడే ఉంది. సోమవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. గరిష్ట ఉష్ణోగ్గతలు క్రమముగా 2 నుండి 3 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యే అవకాశముంది. శనివారం, ఆదివారం, సోమవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. గరిష్ట ఉష్ణోగ్గతలు క్రమముగా 2 నుండి 4 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. తెలంగాణలో కూడా భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. శనివారం 8 జిల్లాల్లో 41 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డ్ అయ్యే చాన్స్ ఉంది.. ఈ మేరకు ఆదిలాబాద్, జగిత్యాల, కొమురం భీం, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఇక.. నిన్న కూడా ఆదిలాబాద్, నిజామాబాద్, భద్రాచలం, మహబూబ్‌నగర్, మెదక్, రామగుండంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని వెల్లడించింది. రెండు, మూడు రోజుల వరకు రెండు నుంచి నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వేసవి కాలం హడలెత్తిస్తోంది.. ఈసారి ఫిబ్రవరి నుంచే ఫుల్ ఫైర్ మీదున్నాడు భానుడు. ఉదయం తొమ్మిది గంటల నుంచే దంచికొడుతున్నాడు. సాయంత్రమైనా భూమి సెగలు.. పొగలు కక్కుతుందంటే టెంపర్ ఏ స్థాయిలో నమోదవుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇక ఇప్పట్నుంచే వణికిస్తున్న ఈ ఎండలకు కొత్తగా యూవీ రేస్.. అదే అతినీలలోహిత కిరణాల ఎఫెక్ట్ కూడా ఉంటుందంటున్నారు వాతావరణశాఖ అధికారులు. ఇప్పటికే కేరళను వణికిస్తున్న ఆ కిరణాలు.. తెలుగు రాష్ట్రాలపైనా విరుచుకుపడొచ్చంటూ వార్నింగ్ బెల్స్ మోగిస్తున్నారు. కేరళలో అతినీల లోహిత కిరణాలు తీవ్రరూపం దాల్చాయి. వాతావరణ కాలుష్యం, ఓజోన్ పొరకు రంధ్రాలు వంటి కారణాలతో యూవీ ఇండెక్స్ అత్యంత ప్రమాదకర కేటగిరీలోకి చేరింది. పలుచోట్ల యూవీ ఇండెక్స్ 11 పాయింట్లు దాటేసింది. దీంతో కేరళలకు చుక్కలు చూపిస్తున్నాడు సూర్యుడు. అత్యవసరమైతే తప్పా ఎవ్వరూ బయటకు రావొద్దంటూ కేరళ విపత్తు నిర్వహణ సంస్థ రెడ్ అలర్ట్ ప్రకటించింది. యూవీ కిరణాల ఎఫెక్ట్‌తో చర్మ సంబంధిత వ్యాధులు, ఐ ఇన్ఫెక్షన్స్ వచ్చే అవకాశాలున్నాయని హెచ్చరిస్తున్నారు. అంతేకాదు%ా% స్కిన్ క్యాన్సర్ వచ్చే చాన్స్ కూడా ఉందని చెబుతున్నారు. అందుకే.. ప్రజలు అతినీలలోహిత కిరణాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దీని ప్రభావం ఉంటుందని.. అతినీలలోహిత కిరణాల బారినపడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# నటి హానీ రోజ్ పై తీవ్ర ఆరోపణలు నటి ఫరా శిబిలా

నటసింహం నందమూరి బాలకృష్ణ నటించిన వీరసింహారెడ్డి సినిమాతో ఒక్కసారిగా తెలుగు ప్రేక్షకుల మనసులో స్థానం సంపాదించుకుంది హాట్ బ్యూటీ హనీరోజ్. మలయాళ ఇండస్ట్రీకి చెందిన ఈ ముద్దుగుమ్మ గతంలో తెలుగులో సినిమాలు చేసింది. కానీ అంతగా గుర్తింపు తెచ్చుకోలేదు. ఆతర్వాత మలయాళం పైనే ఎక్కువ దృష్టి పెట్టింది. అక్కడ వరుసగా సినిమాలు చేసి క్రేజ్ తెచ్చుకుంది. మలయాళంలో హనీ రోజ్ చాలా పాపులర్ నటి. వీరసింహారెడ్డి సినిమా తర్వాత ఈ ముద్దుగుమ్మ మరో సినిమా అనౌన్స్ చేయలేదు. చాలా రోజుల తర్వాత హనీ రాచెల్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా మలయాళంతో పాటు పలు భాషల్లోనూ విడుదల కానుంది. సినిమాలే కాకుండా సోషల్ మీడియాలో కూడా చాలా యాక్టివ్‌గా ఉంటుంది ఈ బ్యూటీ. హనీ రోజ్ చేసిన అన్ని ఫోటోషూట్‌లు నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. అంతే కాదు ఈ అమ్మడు సినిమాలతో కంటే షాపింగ్ మాల్స్ ఓపెనింగ్స్ తోనే కాలం గడిపేస్తోంది. ఇదిలా ఉంటే తాజాగా హనీ రోజ్ పై ఓ నటి తీవ్ర ఆరోపణలు చేసింది. హనీరోజ్ తప్పుడు దారిలో డబ్బులు సంపాదిస్తుందని ఆమె ఆరోపించింది. ఇంతకూ ఆమె ఎవరంటే ఫరా శిబిలా. నటి ఫరా శిబిలా హనీరోజ్ గురించి మాట్లాడుతూ.. మనపై మనకు నమ్మకం ఉండాలి.అప్పుడే ముందడుగు వేయాలి. ఎవరైనా సరే ప్రతిభను నమ్ముకోవాలి కానీ శరీరాన్ని కాదు. ఇక హనీ రోజ్ ఇప్పుడు శరీరాన్ని చూపిస్తూ డబ్బు సంపాదిస్తోంది అంటూ చెప్పుకొచ్చింది. హనీరోజ్ డ్రస్సింగ్ గురించి నేను మాట్లాడటం లేదు. కానీ ఆమె ఫోటో షూట్స్ లో రకరకాల ఫోజులు ఇస్తూ ఫోటోలు దిగుతుంది. రకరకాల యాంగిల్స్ లో తీసిన ఫోటోలను, వీడియోలను ఆమె స్వయంగా షేర్ చేస్తోంది. ఇన్స్టాగ్రామ్ లో అందరూ కూడా తమ శరీరాలను చూపిస్తూ ఎగ్జిబిషన్ పెట్టేస్తున్నారు. హనీరోజ్ కూడా అదే చేస్తుంది అని ఆమె ఆరోపించింది. హనీరోజ్ అమాయకురాలు కాదు. ఆమెకు అన్ని తెలుసు. శరీరాన్ని చూపిస్తూ డబ్బు సంపాదించడం అనేది తప్పు అని నా అభిప్రాయం అని తెలిపింది. మరి దీని పై హాని రోజ్ ఎలా స్పందిస్తుందో చూడాలి.



# తమన్నా బాయ్‌ఫ్రెండ్‌కు అరుదైన వ్యాధి



సీనియర్ నటి తమన్నా భాటియా, బాలీవుడ్ ప్రముఖ నటుడు విజయ్ వర్మ వివాహం చేసుకుంటారని అభిమానులు ఆశగా ఎదురు చూశారు. కానీ ఇప్పుడు షాకింగ్ న్యూస్ ఒకటి వినిపిస్తోంది. చాలా కాలంగా డేటింగ్ లో ఉన్న విజయ్ వర్మ, తమన్నా భాటియా ఇప్పుడు విడిపోయారని వార్తలు పుట్టుకొచ్చాయి. అయితే ఈ వార్తల్లో వాస్తవం లేదని తెలుస్తుంది. మిల్కీ బ్యూటీ తమన్నా ఒకానొక సమయంలో టాలీవుడ్‌ను ఏలింది. వరుసగా సినిమాలు చేసి మంచి క్రేజ్ తెచ్చుకుంది ఈ అమ్మడు. తెలుగులో దాదాపు స్టార్ హీరోలందరి సరసన సినిమాలు చేసింది. శ్రీ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ చిన్నది.. హ్యాపీడేస్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమా తర్వాత తెలుగులో బిజీగా మారిపోయింది. తమన్నా ప్రస్తుతం తెలుగులో సినిమాలు తగ్గించింది. హిందీ మీద ఎక్కువ ఫోకస్ పెట్టింది ఈ చిన్నది. తెలుగులో చివరిగా చిరంజీవి హీరోగా నటించిన భోళాశంకర్ సినిమాలో చేసింది. ఈ సినిమా డిజాస్టర్ గా నిలిచింది. ఇదిలా ఉంటే తమన్నా త్వరలోనే పెళ్లి పీటలెక్కనుందని వార్తలు వినిపిస్తున్నాయి. తమన్నా విజయ్ వర్మతో ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. విజయ్ వర్మ ఎవరో కాదు. బాలీవుడ్ నటుడు.. అలాగే నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన ఎమ్‌సీఏ సినిమాలో విలన్ గా నటించాడు. అయితే చాలా కాలంగా ప్రేమలో మునిగి తేలుతున్నారు. అయితే ఈ ఇద్దరూ ఈ మధ్య విడిపోయారు అంటూ వార్తలు వచ్చాయి. తమన్నా, విజయ్ వర్మ బ్రేకప్ చేసుకున్నారని రూమర్స్ వినిపించాయి. వాటిలో నిజం లేదు అని అంటున్నారు. ఇదిలా ఉంటే విజయ్ వర్మ ఓ అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడని తెలుస్తుంది. విజయ్ వర్మ తనకు విటిలిగో అంటే బొల్లి వ్యాధి ఉందని బహిరంగంగానే తెలిపారు. ఈ వ్యాధి కారణంగా తన చర్మం పై తెల్లటి మచ్చలు ఉంటాయని వివరించారు. అలాగే దాని కారణంగా తన లైఫ్ లో అశాంతి నిండిపోయింది అని తెలిపారు. ఇదిలా ఉంటే తమన్నా విజయ్ కలిసి ఓ వెబ్ సిరీస్ లోనూ నటించారు. త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారని తెలుస్తుంది. రీసెంట్ గానే ఈ ఇద్దరూ కలిసి హోలీ సెలబ్రేషన్ లో పాల్గొన్నారు.

# కార్ రేసింగ్ ట్రాక్ వద్ద శోభిత, నాగచైతన్య క్యూట్ ఫొటోలు

ప్రస్తుతం టాలీవుడ్ క్యూట్ కపుల్స్‌లో నాగ చైతన్య, శోభిత జంట ఒకటి.సమంత నుండి విడిపోయాక నాగ చైతన్య కొన్ని నెలల పాటు శోభితతో ప్రేమాయణం నడిపి గత ఏడాది వివాహం చేసుకున్నాడు. ఇక పెళ్ళైనప్పటి నుండి వీరిద్దరు చాలా సరదాగా గడుపుతున్నారు. సోషల్ మీడియాలో యాక్టీవ్ రోల్ పోషించే శోభిత ఎప్పటికప్పుడు వాటికి సంబంధిచిన ఫోటోస్ షేర్ చేయడంతో వైరల్ అయ్యాయి. ఈ జంట ఆమ్‌స్టర్‌డామ్ , మెక్సికోలలో వీధి వీధి తిరుగుతూ సరదాగా ఎంజాయ్ చేశారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్ నుండి సాయంత్రం వరకు ఎలా గడిపారో ఫోటోల ద్వారా తన అభిమానులకు తెలియజేసింది. అయితే తాజాగా ఈ జంట రేసింగ్ ట్రాక్‌పై సందడి చేసింది.తండేల్ సక్సెస్ తర్వాత నాగచైతన్య, శోభిత దంపతులు హాలిడే ట్రిప్ ఎంజాయ్ చేస్తుండగా, ఈ క్రమంలోనే కార్ రేసింగ్ ట్రాక్ వద్ద తమ డేను సరదాగా గడిపారు.చై, శోభిత కలిసి రేసింగ్ ట్రాక్‌లో గడిపిన క్షణాలను శోభిత సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. కాగా, చైతన్యకి రేసింగ్ అంటే చాలా ఇష్టం . అందుకే శోభితను సైతం అక్కడకు తీసుకెళ్లారు. ఆమెతో సరాదాగా రేసింగ్ కారు నడిపారు. అంతే కాదండోయ్.. నాగ చైతన్య తనకు ఇష్టమైన రేసింగ్ కారులో శోభితను కూర్చోబెట్టి ఫోటోలు దిగగా, ఇవి నెటిజన్స్‌ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇక ఇటీవలే ఈ కపుల్ యూరప్ ట్రిప్ ఎంజాయ్ చేశారు. గతేడాది డిసెంబర్ 4న హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో శోభిత మెడలో మూడు ముళ్లు వేశాడు నాగ చైతన్య. ఓ ఇంటర్వ్యూలో ఆమెతో జీవితాన్ని పంచుకోవడం చాలా ఆనందంగా ఉందని.. తనతో అన్ని విషయాలు పంచుకుంటానని, ఎప్పుడైనా కన్ఫ్యూజ్ అయితే వెంటనే ఆమె సలహా తీసుకుంటానని నాగ చైతన్య స్పష్టం చేశారు. తండేల్ సక్సెస్ జోష్ లో ఉన్న నాగ చైతన్య ఇప్పుడు చాలా జోష్‌తో కనిపిస్తున్నారు. భార్య శోభితని తీసుకొని పలు ప్రాంతాలకి తిరుగుతున్నాడు. ఈ కొత్త జంటను ఇలా చూసి అక్కినేని ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. క్యూట్ కపుల్ ఎంజాయ్ చేయండి అంటూ కామెంట్లు చేస్తున్నారు.

# ఆ ఇద్దరు నిర్మాతలకు హ్యాండించిన సన్నిడియోల్

బాలీవుడ్‌లో ఏ హీరో కు ఎప్పుడు టైమ్ వస్తుందో చెప్పడం కష్టం. అగ్ర కథానాయకులుగా రాణించిన వారు... ఒక్కసారిగా తెర మాటుకు వెళ్ళిపోతుంటారు. 'ఇక ఈ హీరో పని అయిపోయింది' అనుకున్న సమయంలో సీనియర్ హీరోలు ఊహించని విజయంతో తెర మీదకు వస్తున్నారు. ప్రస్తుతం సన్నీ డియోల్ పరిస్థితి ఇదే. సన్నీ డియోల్ కు ఇక విజయం దక్కడం కష్టమని అంతా అనుకుంటున్న టైమ్ లో 'గదర్ -2' సినిమాతో అమాంతంగా రూ. 500 కోట్ల క్లబ్ లో చేరి 'సన్నీ ఈజ్ బ్యాక్' అనిపించుకున్నాడు. అయితే 'గదర్ -2' సక్సెస్ తర్వాత సన్నీ డియోల్ ప్రాధాన్యతలు మారిపోయాంటూ కొందరు వాపోతున్నారు. 'గదర్ -2' చిత్రానికి ముందు సన్నీ కొన్ని సినిమాలు అంగీకరించాడు. అందులో ఒకటి 'సూర్య'. ఇది మలయాళ చిత్రం 'జోసఫ్'కు రీమేక్. కమల్ ముకుత్ నిర్మిస్తున్న ఈ సినిమా దాదాపు ఎనభై శాతం షూటింగ్ అయిపోయింది. కానీ నిర్మాణపరంగా జరిగిన జాప్యంతో ఈ మూవీ వెనక్కి వెళ్ళిపోయి 'గదర్ -2' ముందు కొచ్చింది. 'గదర్ -2' తర్వాత 'సూర్య' ను పూర్తి చేస్తానని సన్నీ చాలా సార్లు చెప్పారు. కారణాలు ఏవైనా... అది మాత్రం జరగలేదు. విశేషం ఏమంటే మలయాళ చిత్రం 'జోసఫ్' ను తెలుగు, తమిళ, కన్నడ భాషల్లోనూ రీమేక్ చేశారు. తెలుగులో దీనిని 'శేఖర్' పేరుతో రాజశేఖర్ రీమేక్ చేయగా, జీవిత డైరెక్ట్ చేసింది. బట్.. మూవీ ఇక్కడ పరాజయం పాలైంది. సన్నీ డియోల్ పక్కన పెట్టిన మరో ప్రాజెక్ట్ 'బాప్'. ఈ సినిమా కూడా 'గదర్ -2' కంటే ముందుదే! సహజంగా ఏ హీరో నటించిన సినిమా అయినా విడుదలై ఘన విజయం సాధించగానే అతను నటించిన చిత్రాలు పాతవి ఆగిపోయి ఉంటే... ఓ ఊపులో అవీ జనం ముందుకు వచ్చేస్తుంటాయి. కానీ సన్నీ డియోల్ విషయంలో మాత్రం అలా జరగడం లేదు. 'బాప్' సినిమాలో సన్నీ తో పాటు సంజయ్ దత్, జాకీ ష్రాఫ్, మిథున్ చక్రవర్తి కీలక పాత్రలు పోషించారు. సినిమా షూటింగ్ దాదాపు పూర్తయిపోయిందని, ఈ సీనియర్ స్టార్స్ కాంబోలో కొన్ని సన్నివేశాలు మాత్రమే చిత్రీకరించాల్సి ఉందని దర్శకుడు అహ్మద్ ఖాన్ చెబుతున్నాడు. కానీ సన్నీ డేట్స్ కేటాయించక పోవడం వల్లే జాప్యం జరుగుతోందని ఆయన వాపోతున్నాడు.



# పవన్‌కళ్యాణ్‌కు గట్టి కౌంటర్ ఇచ్చిన ప్రకాశ్‌రాజ్



జనసేనాని పవన్ కళ్యాణ్ చిత్రాడలో జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ సభలో పలు విషయాల గురించి మాట్లాడారు. ఈ క్రమం లోనే తమిళనాట హిందీని తమపై రుద్దుతున్నారని హడావిడి చేస్తున్న కొందరి గురించి కామెంట్స్ చేశారు. అంటే పరోక్షంగా తమిళనాడు అంశాన్ని ప్రస్తావించారు. అన్ని దేశ భాషలే కదా. తమిళనాడులో హిందీ వద్దని అనడం ఎంత వరకు కరెక్ట్. మరి తమిళ సినిమాలను హిందీలోకి అనువదించకండి.. హిందీవాళ్ల డబ్బులు కావాలి.. కానీ హిందీ భాష వద్దంటే ఎలా? మనం భాషలను ద్వేషించాల్సిన అవసరం లేదు. దేశానికి తమిళం సహా బహుళ భాషలు కావాలి.. బహుభాషలే దేశానికి మంచిది అంటూ పవన్ కళ్యాణ్ కామెంట్ చేశారు. అంతేకాదు తమిళనాడులో సంస్కృతాన్ని తిడుతున్నారు. దక్షిణాదిపై హిందీని రుద్దుతున్నారంటూ మాట్లాడుతున్నారు. ఏ రాష్ట్రంలో అయిన ముస్లింలు అరబిక్‌లోనే ప్రార్థిస్తారు. కానీ ఎన్నడూ ఆ భాష తమకొద్దని అనలేదు. హిందువులు మాత్రం దేవాలయాలలో సంస్కృత మంత్రాలు చదవొద్దని చెబుతుంటారు. ముస్లింలని చూసి హిందువులు చాలా నేర్చుకోవాలి. రూపాయి సింబల్ మార్చేసి తమిళ భాషలో పెట్టుకోవటం ఏంటి? వివేకం, ఆలోచన ఉండొద్దా అన్నారు పవన్ కళ్యాణ్. ఉత్తరాది వాళ్లు తెల్లగా ఉంటారు. మేం దక్షిణాది వాళ్లం నల్లగా ఉంటామనే మాటలతో దేశాన్ని విచ్ఛిన్నం చేయకండి. దక్షిణాదికి చెందిన సెంగోల్.. ఉత్తరాదిన ఉన్న పార్లమెంట్‌లో ఉంది. దీని అర్థం వైరుధ్యమొస్తే విడిపోవాలని కాదు. కలిసి పరిష్కారం వెతుక్కోవాలని. విధ్వంసం చాలా తేలిక. నిర్మించటమే కష్టం అని పవన్ అన్నారు. అయితే పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలకి ప్రకాశ్ రాజ్ తనదైన శైలిలో స్పందించారు. మీ హిందీ భాషను మా మీద రుద్దకండి', అని చెప్పడం ఇంకో భాషను ద్వేషించడం కాదు, 'స్వాభిమానంతో మా మాతృభాషను, మా తల్లిని కాపాడుకోవడం', అని పవన్ కళ్యాణ్ గారికి 'ఎవరైనా చెప్పండి ప్లీజ్' అంటూ ప్రకాష్ రాజ్ ట్వీట్ చేశారు. ప్రకాష్ రాజ్ గతంలో కూడా పవన్ కళ్యాణ్‌కి కౌంటర్స్ ఇచ్చిన విషయం తెలిసిందే. తిరుమల లడ్డూ వ్యవహారం, సనాతన ధర్మం విషయంలో పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు ప్రకాశ్ రాజ్ పంచ్ లు ఇచ్చాడు. ఇక తాజాగా హిందీ భాష అంశంపై చేసిన వ్యాఖ్యలకు కూడా జస్ట్ ఆస్కింగ్ అంటూ ప్రకాష్ రాజ్ కౌంటర్ ఇచ్చారు.